www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM ★

తర తరాల పిల్లల కథలు
రూ॥ 70/-
పేజీలు: 64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



# పివికి భారతరత్న ప్రదానం

మరో ప్రధాని చౌదరి చరణ్‌సింగ్, ఎంఎస్ స్వామినాథన్, కర్పూరీ ఠాకూర్‌కు కూడా

పురస్కారాన్ని స్వీకరించిన కుటుంబ సభ్యులు

**న్యూఢిల్లీ :** దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రదానోత్సవం శనివారం జరిగింది. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మాజీ ప్రధానులు పివి నర్సింహారావు, చౌదరి చరణ్‌సింగ్, వ్యవసాయశాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్, రెండుసార్లు బీహార్ ముఖ్యమంత్రిగా పని చేసిన కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్నను ప్రదానం చేశారు. వీరి తరుపున వారి కుటంబ సభ్యులు పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ప్రధాని నరేంద్ర మోడీ, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. భారత 9వ ప్రధానమంత్రిగా పివి నర్సింహారావు ఆర్థిక సంస్థరణలకు నాయకత్వం వహించారు. తాను యువకునిగా ఉన్నప్పుడు స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ముఖ్యంగా నిజాంపాలనలో హైదరాబాద్‌లో దుష్టపాలన, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడారు. ఆయనకు పలు భాషలు, సాహిత్యంపై మంచి పట్టు ఉన్నట్లు రాష్ట్రపతి భవన్ 'ఎక్స్'లో పోస్టు చేసింది. పివి తరుపున ఆయన కుమారుడు పివి ప్రభాకర్‌రావు భారతరత్నను అందుకున్నారు. 1991 నుంచి 1996 వరకు పివి నర్సింహారావు ప్రధానిగా ఉన్నారు. రాజకీయాలలో పివిని చాణక్యుడు అని పిలిచేవారు. అయితే దక్షిణాది రాష్ట్రాల నుంచి ప్రధాని అయిన మొదటి తరువాయి 2లో

# మోడీని ఎదుర్కోవడానికి భారీ పోరాటాలు

'సిఎఎ' పేరుతో రభస సృష్టిస్తున్న మోడీ సర్కార్

వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య పార్టీలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని పిలుపు



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రమాదకరమైన మోడీని ఎదుర్కొనేందుకు, సమస్యలు, అంశాల ప్రతిపాదికన లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష పార్టీలు భారీ పోరాటాలకు సన్నద్ధం కావాలని, తద్వారా సమాజాన్ని చైతన్యపర్చాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసన సభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు.'సిఎఎ' పేరుతో ఒక రభసను సృష్టించి, హిందూ ,ముస్లిం పేరుతో దేశాన్ని రావణ కాష్టంగా మార్చాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆలోచిస్తోందని దుయ్యబట్టారు. ''కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలు, మతోన్మాదానికి'' వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం రాష్ట్ర సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జి.నర్సింహా రావు అధ్యక్షత వహించగా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభులు ఎన్.బాలమల్లేశ్ స్వాగతం పలికారు. ఈ సదస్సులో కూనంనేని సాంబశివరావుతో పాటు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, సిపిఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటురంగారావు, సిపిఐ(ఎం.ఎల్) న్యూ డెమోక్రసి రాష్ట్ర సహాయ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వర రావు, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ఎస్‌యుసిఐ రాష్ట్ర నాయకులు జానీపాషా, ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జానకిరాములు, సిపిఐ(ఎం.ఎల్) రాష్ట్ర నాయకులు ప్రసాదన్న, సిపిఐ(ఎం.ఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం. రమేష్ రాజా, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకులు ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రతిపౌరుడు తానూ భారతీయుడినే అని క్యూలో నిలబడి నిరూపించుకునే పరిస్థితిని తీసుకొచ్చారన్నారు. సిఎఎను అమలు చేయబోమని ఇప్పటికే పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలు తీర్మానాలు చేశాయని, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తీర్మానం చేయాలని సూచించారు. వ్యక్తి కేంద్రంగా పనిచేసే సిద్ధాంతమే కమ్యూనిజం, సోషలిజం అదే మార్క్సిజం అని, మార్క్సిజం లేకుండా ప్రపంచం ముందుకు సాగబోదన్నారు. నిరంతరం పోరాట యోధులుగా తమ కర్తవ్య నిర్వహణలో అలుపెరగకుండా ముందుకు వెళ్లాలన్నారు. మోడీ అధికారం కోసం ఎంతకైనా తెగిస్తారని, ఆయన ఎవరినీ, ఏ పార్టీని బతకనివ్వడని, అనేక రకాల నిర్భందాలు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. క్రూరత్వంతో కూడిన అన్ని రకాల విధానాలను అనుసరించడం ద్వారా తరువాయి 2లో

## ఏప్రిల్ 1 నుండి రాష్ట్రవ్యాప్త సదస్సులు

ప్రభుత్వ విధానాలు, మతోన్మాదానికి వ్యతిరేకంగా ఏప్రిల్ 1నుండి 15వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా,మండల స్థాయిలలో సదస్సులను, సమావేశాలను నిర్వహించి, ప్రజలను చైతన్యపర్చాలని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగిన సదస్సు తీర్మానించింది. ఈ తీర్మానాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రవేశపెట్టగా, సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది.



తాగునీటి కొరత అధిగమించేందుకు

# యుద్ధప్రాతిపదికన చర్యలు

కరెంటు కోతలు ఉండొద్దు

వేసవికి ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవాలి

సమీక్షా సమావేశంలో అధికారులకు ముఖ్యమంత్రి అత్యవసర ఆదేశాలు

ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏప్రిల్, మే, జూన్ వరకు స్థానికంగా ఉన్న నీటి వనరులను ఉపయోగించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బోర్ వెల్స్, బావులన్నింటినీ తాగునీటి అవసరాలకు వాడుకోవాలని, సమీపంలో ఉన్న నీటి వనరులన్నింటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా జిల్లా కలెక్టర్లు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. సమస్య ఉన్న చోట తక్షణ పరిష్కారాలను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో ఒక సీనియర్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించాలని ఆదేశించారు. సచివాలయంలో శనివారం తాగునీరు, విద్యుత్ సరఫరాపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వేసవి కోసం ప్రత్యేకంగా గ్రామాల వారీగా డ్రింకింగ్ వాటర్ యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని సిఎం చెప్పారు. అవసరాన్ని బట్టి రాష్ట్ర స్థాయి నుంచి సంబంధిత శాఖల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. మున్సిపాలిటీలు, తరువాయి 2లో

నేడు 'ఇండియా' కూటమి

# లోక్‌తంత్ర బచావో ర్యాలీ




**న్యూఢిల్లీ :** ఇండియా కూటమి ఆధ్వర్యంలో దేశరాజధాని ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఆదివారం నాడు 'లోక్‌తంత్ర బచావో (ప్రజాస్వామ్య పరిరక్షణ) ర్యాలీ' నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ , సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి, జార్ఖండ్ సిఎం చంపై సోరెన్, ఎన్‌సిపి(ఎస్‌పి) అధ్యక్షులు శరద్ పవార్, ఆర్‌జెడి నాయకుడు తేజస్వీ యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఫరూఖ్ అబ్దుల్లా, పిడిపి నేత మెహబూబా ముఫ్తీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, డిఎంకె నేత తిరుచ్చి శివ, టిఎంసి ప్రతినిధి డెరిక్ ఒబ్రైన్ తదితరులు పాల్గొంటారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంతో ఈ ర్యాలీని నిర్వహిస్తున్నామే తప్ప ఏ ఒక్క వ్యక్తి కోసం కాదని ఇండియా కూటమిలోని ప్రధాన భాగస్వామి కాంగ్రెస్ స్పష్టం చేసింది. రామ్‌లీలా మైదానం నుండి లోక్ కల్యాన్ మార్గ్( ప్రధాని నివాసం)కు తమ తరువాయి 2లో


పి.అనిల్‌కుమార్ ఫోటో జర్నలిస్ట్

# దోచుకుని దాచుకున్నారు...

గత పదేళ్ళలో బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిందేమీలేదు

మంత్రులు ఉత్తమ్, తుమ్మల, కోమటిరెడ్డి మండిపాటు

పార్లమెంట్ ఎన్నికల్లో 14 సీట్లు గెలుచుకుంటామని ధీమా

ప్రజాపక్షం/మఠంపల్లి



గత 10 సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి ఏమీచేయలేదని, తెలంగాణను దివాళాతీసిందని రాష్ట్ర నీటిపారుదలశాఖ, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర అర్అండ్‌బి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు విమర్శించారు. టిఆర్ఎస్ నాయకులు దోచుకోవడం, దాచుకోవడం, స్కాములు తప్ప తెలంగాణలో ఒరగబెట్టింది ఏమీ లేదని, ఏ మొహం పెట్టుకుని తెలంగాణ ప్రజలను ఓట్లు అడుగుతారని నిలదీశారు. కచ్చితంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 13 నుండి 14 స్థానాలు గెలుచుకుంటుందని, నల్లగొండ ఎంపి అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. శనివారం సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లిలో నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. అంతక ముందు మట్టపల్లి లక్ష్మీ నరసింహాస్వామి దేవాలయాన్ని ఎఐసిసి రాష్ట్ర ఇంచార్జి దీపాదాస్ మున్షీతో కలసి మంత్రులు, పలువురు ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక ఆశీర్వచనాలు అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని గతంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కాలంలో ఎంతో తరువాయి 2లో

రండి బాబూ...రండి

# అవినీతిపరులకు 'బిజెపి మోడీ వాషింగ్ పౌడర్'

బిజెపి ప్రభుత్వ తీరుతెన్నులపై కాంగ్రెస్ వ్యంగ్యాస్త్రాలు

ఇప్పటివరకూ 21 మంది నాయకులకు క్లీన్‌చిట్ ఇచ్చారని

పత్రికాగోష్టిలో పవన్ ఖేరా విమర్శ




**న్యూఢిల్లీ :** ముందుగా దర్యాప్తు సంస్థలను పంపి కేసులు పెట్టి ఆ తర్వాత బిజెపి సదరు వ్యక్తులను, నాయకులను తమ పార్టీలో చేర్చుకుని క్లీన్ చిట్ ఇవ్వడంపై శనివారం ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో జరిగిన పత్రికాగోష్ఠిలో కాంగ్రెస్‌పార్టీ ప్రాక్టికల్ జోక్ పేల్చింది. పత్రికాగోష్ఠి వేదికపైకి ఒక వాషింగ్ మెషీన్‌ను తీసుకువచ్చి ప్రదర్శించి బిజెపి ప్రభుత్వ తీరు తెన్నులపై వ్యంగ్యాస్త్రాలు సంధించింది. ఈ సందర్భంగా పత్రికాగోష్టిలో పాల్గొన్న మీడియా ప్రతినిధులకు ''మోడీ వాషింగ్ పౌడర్'' పేరుతో మోడీ ముఖచిత్రం ముద్రించి ఉన్న లీఫ్‌లెట్‌లను కూడా పార్టీ నాయకులు పంచిపెట్టారు. దీనికిందనే ''అన్ని రకాల అవినీతి మరకలూ క్షణాల్లో మటుమాయం'' (సారే దాగ్ ఛుట్కియోన్ మే ధూలే) అని కూడా వ్యంగ్యంగా ముద్రించారు. 2017లో జరిగిన ఒక అవినీతి కేసులో నేషనలిస్ట్ తరువాయి 2లో

# దక్షిణాది పట్ల మౌనమెందుకు?

లౌకికవాదం అంతంచేసే కేంద్రప్రభుత్వ చర్యలపై ప్రజలు ఆందోళన

బిజెపి సర్కార్‌పై కేరళ సిఎం పినరయి విజయన్ మండిపాటు



**తిరువనంతపురం :** భారతదేశ లౌకిక, ప్రజాస్వామ్య స్వభావాన్నే లేకుండా చేసేందుకు బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం దాడి చేస్తోందని కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ మండిపడ్డారు. తమను ఎవరూ ఓడించలేరని బిజెపి అనుకుంటోందని, 2004లో నాటి ప్రధాని వాజ్‌పేయ్ ఇలాగే భావించారని, కాని బిజెపి అధికారంలోకి వస్తే ప్రమాదమని ప్రజలు గుర్తించి, ఆ పార్టీని ఓడించారని గుర్తు చేశారు. బిజెపి ఎలాంటి వ్యూహాలు రచించినా కూడా కేరళలో గెలిచేందుకు అవకాశం లేదని, ఆ పార్టీ సిద్ధాంతాలు, విధానాలను ప్రజలు అంగీకరించబోరని స్పష్టం చేశారు. కేరళ రాజధాని తిరువనంతపురం లోక్ సభ నియోజకవర్గం నుండి ఎల్‌డిఎఫ్ తరుపున పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి పన్నియన్ రవీంద్రన్‌కు మద్దతుగా శనివారం తరువాయి 2లో

హవాలా కేసులో ఢిల్లీ జలమండలిపై

# 8 వేల పేజీల ఇడి చార్జిషీట్

**న్యూఢిల్లీ :** ఢిల్లీ జల మండలిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు హవాలా కేసులో మొట్టమొదటి చార్జిషీటు నమోదు చేశారు. ఢిల్లీ జల మండలి (డిజెబి)లో అవినీతి, అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఇడి అధికారులు దర్యాప్తు జరిపారు. పిఎంఎల్‌ఎ చట్టం కింద ఢిల్లీ కోర్టులో రికార్డుస్థాయిలో 8,000 పేజీలకు పైగా ఉన్న చార్జిషీటును ఈనెల 28వ తేదీన అధికారులు దాఖలు చేశారు. ఈ చార్జిషీటులో 140 పేజీల మేరకు పీఠిక, పరిచయం ఉంది. కోర్టు ఈ కేసును సోమవారానికి వాయిదా వేసింది. ఒక కంపెనీకి చెందిన నలుగురు వ్యక్తులను ఈ కేసులో ప్రధాన నిందితులుగా గుర్తించారు. ఢిల్లీ జల మండలి ప్రధాన ఇంజనీరు జగదీశ్ కుమార్ అరోరా, కాంట్రాక్టర్ తరువాయి 8లో



# కాంగ్రెస్‌లో చేరిన హైదరాబాద్ మేయర్

బిఆర్ఎస్ మాజీ ఎంఎల్‌సి పురాణం సతీష్ కూడా..

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్‌కు చెందిన కీలక నేతలు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. బిఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత డాక్టర్ కె.కేశవరావు కుమార్తె, జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి, బిఆర్ఎస్ మాజీ ఎంఎల్‌సి పురాణం సతీష్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. వారికి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, ఎంఎల్‌ఏలు వివేక్ వెంటకస్వామి, గడ్డం వినోద్, పెద్ద పల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణా ఉన్నారు.

# 'ధరణి' ఓ కుట్ర

నాటి సిఎస్ సోమేశ్‌కుమార్ ఆధ్వర్యంలో

భూకుంభకోణం : కోదండరెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్

కుట్ర పూరితంగానే మాజీ సిఎం కెసిఆర్ ధరణి పోర్టల్‌కు రూపకల్పన చేశారని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ ఆధ్వర్యంలో భూ కుంభకోణం జరిగిందన్నారు. భారతదేశంలోనే అతి పెద్ద కుంభం కోణం బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిందని కోదండ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గాంధీ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అవకతవకలపై మొత్తం కెసిఆర్, కెటిఆర్‌లే భాగస్వాములన్నారు. రెవెన్యూ శాఖ కెసిఆర్ దగ్గర ఉందని, ఐటి శాఖ కెటిఆర్ దగ్గర ఉందని, కుంభకోణాలకు మొత్తం తరువాయి 2లో



టిఆర్ఎస్ సెక్రటరీ జనరల్ కె.కేశవరావును బంజారాహిల్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లి కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి, అనిల్ యాదవ్, జానారెడ్డి, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్, తదితరులు

# ఎండ ప్రచండం

## మండిపోతున్న పగటి ఉష్ణోగ్రతలు

## భద్రాచలం @ 43 డిగ్రీలు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం** : మార్చి నెల చివరాంతంలో భానుడు విశ్వరూపం చాటుతున్నాడు. జిల్లాలో ఎండ దంచికొడుతోంది. దీంతో అత్యధిక గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం భద్రాచలంలో అత్యధికంగా 43 డిగ్రీల పగటి ఉష్ణోత్రలు నమోదయ్యాయి. ఎండతీవ్రత కారణంగ ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. సూర్యుని ప్రతాపం ఉదయం 10 గం. నుండే ప్రారంభమైంది. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రధాన పట్టణాల్లో రోడ్లన్ని నిర్మాణుష్యంగా మారాయి. ఎండతీవ్రతను నుండి ఉపశమనం పొందేందుకు ప్రజలు తంటాలు పడుతున్నారు. చల్లని పానియాలు, నిమ్మరం, చెరకు రసం, కొబ్బరి బోండాలు తదితర శీతల పానియాలవైపు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. మిట్ట మధ్యాహ్నం వేళ ప్రజలు ఉక్క పోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కూలర్లు, ఏసిల మాటున సేద తీరుతున్నారు. చల్లని నీళ్ల కోసం ఫ్రిజ్‌లు, కండలు వాడుతున్నారు. ఆరోగ్య రీత్యా ప్రజలు ఫ్రిజ్‌లు ఉన్నప్పటికీ కుండలు కొనుగోళ్లు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణం చేయాల్సి వస్తే క్యాపులున, రుమాళ్లు, కండువాలు, హెల్మెట్‌లు ధరిస్తున్నారు. ప్రధానంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంతో పాటు ఇల్లెందు, పినపాక నియోజకవర్గాల్లో సింగరేణి గనులు ఉండటంతో ఎండ తీవ్రత మరింతగా ఉంది. భద్రాచలం వద్ద గోదావరి నదిలో నీళ్లు లేక పోవడంతో ఇసుక తెన్నులు దర్శనమిస్తున్నాయి. ఈ ఎండకు ఇసుక మరింత వేడెక్కి వీస్తున్న గాలులకు ఉష్ణ తాపాన్ని కలిగిస్తోంది. రాత్రి 11 గం. వరకు కూడా వాతావరణం చల్లబడక పోవడంతో ప్రజలు నిద్రకు కూడా ఇబ్బంది పడుతున్నారు. వేసవి కాలంలో పగడి సమయం ఎక్కువగా ఉన్న కారణంగా రాత్రి వేళల్లో ఆలస్యంగా నిద్రపోతుండటం వల్ల పెందలకాడే లేవలేక పోతున్నారు. ఈ ఎండల్లో వృద్ధులు, పిల్లలు మరింత ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతేనే తప్ప బయటకు రావద్దని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

**జిల్లా వ్యాప్తంగా 40 డిగ్రీల పై బడిన ఉష్ణోగ్రతలు**

జిల్లా వ్యాప్తంగా చూస్తే భద్రాచలంలో అత్యధిగంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సుజాతనగర్ 42.9 డిగ్రీలు, గరిమెల్లపాడులో 42.6, కొత్తగూడెం 42.5, పాల్వంచ 42.3,లక్ష్మీ దేవిపల్లి 42.1, అశ్వాపురం 41.8, ఆళ్లపల్లి 40.9,గుండాల 40.6,యానంబైలు 40.5, జులూరుపాడు 40.4, ములకలపల్లి 40.3, అన్నపురెడ్డిపల్లి లో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

**అటవీప్రాంతాల్లోనూ భారీ ఎండలు:** జిల్లాలో ఎక్కువ శాతం అటవీ ప్రాంతాలే ఉన్నాయి. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో పెద్ద ఎత్తున అడువులువిస్తరించి ఉన్నాయి. అందే విధంగా ములకలపల్లి, యానంబైలులో కూడా అటవీ విస్తీర్ణం అధికంగానే ఉంది. అటవీ ప్రాంతాల్లో సైతం ఎండలు అధర గొడుతుంటే ఇతర ప్రాంతాల పరిస్థితి ఊహించుకుంటేనే భయంగా ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

## వేతనాలు చెల్లించేందుకు నిధులు విడుదల

### టివివిపి ఆసుపత్రుల కాంట్రాక్టు కార్మికుల సమ్మె విరమణ

### తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ప్రకటన

**ప్రజాపక్షం / హైదరాబాద్:** తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఏరియా ఆసుపత్రుల్లో, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించేందుకు నిధులు విడుదల చేసినందున ఏప్రిల్ 1వ తేదీ నుంచి తలపెట్టిన సమ్మెను విరమించినట్లు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్, ,ప్రధాన కార్యదర్శులు ఎం.నరసింహ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిధులు విడుదల చేసినందున ఒకటి రెండు రోజుల్లో కార్మికులందరికీ పెండింగ్ జీతాలన్నీ చెల్లించే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని టివివిపి కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ యూనియన్ ప్రతినిధులకు వివరించినట్లు వారు తెలిపారు. కమిషనర్ ఇచ్చిన హామీ మేరకు వచ్చే వారంలో కార్మికులందరికీ పెండింగ్‌లో జీతాలన్నీ చెల్లించాలని, అప్పటివరకు సమ్మెను విరమిస్తున్నట్లు వారు ఈ సందర్భంగా కమిషనర్‌కు హామీ ఇవ్వడం జరిగింది. అతి క్లిష్ట పరిస్థితుల్లో కార్మికులు జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నటువంటి సమయంలో యూనియన్ అడిగిన వెంటనే కార్మికులకు జీతాలు విడుదల చేయడానికి కృషి చేసిన హెల్త్ మెడికల్ అండ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీకి, ఫైనాన్స్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావుకు, టివిబిపి కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌కు యూనియన్ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. జీతాల సాధనకు పోరాడిన కార్మికవర్గానికి, సహకరించిన అధికారులకు యూనియన్ కృతజ్ఞతలు తెలియజేస్తుందన్నారు.

## లోక్‌తంత్ర బచావో ర్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

ర్యాలీ ద్వారా ఇండియా కూటమి బలమైన సందేశాన్ని పంపనున్నామని పేర్కొంది. ఢిల్లీలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ మాట్లాడుతూ ఇది కేవలం ఒక వ్యక్తి కోసం నిర్వహిస్తున్న ర్యాలీ కాదని, ఒక పార్టీకి చెందిన ర్యాలీ కాదన్నారు. సుమారు 27– 28 రాజకీయ పక్షాలు ఇందులో భాగస్వాములని ఆయన తెలిపారు. మార్చి 17న ముంబైలో ఇండియా కూటమి ఎన్నికల శంఖారావాన్ని పూరించిందని, ఢిల్లీలో జరిగే 'లోక్ తంత్ర బచావో ర్యాలీ' ఇండియా కూటమి రెండవ ప్రచార సభ అని పేర్కొన్నారు. దీని ద్వారా కూటమిలోని భాగస్వాముల మధ్య సంఘీభావం , ఐక్యతను చాటుతామన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలు, 45 ఏళ్ళలో అత్యధిక నిరుద్యోగ రేటు, ఆర్థిక అసమానతలు, సమాజ విభజన, రైతులకు అన్యాయం తదితర అంశాలపై ప్రతిపక్ష నాయకులు ప్రసంగిస్తారని చెప్పారు. ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా కేంద్ర సంస్థల దుర్వినియోగమనే కీలకాంశాన్ని కూడా లేవనెత్తుతారని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలను రాజకీయంగా లక్ష్యం చేసుకోవడంలో భాగంగా ఇద్దరు ముఖ్యమంత్రులు, పలువురు మంత్రులను అరెస్టు చేశారన్నారురు. ప్రతిపక్ష పార్టీలను రాజకీయంగా , ఆర్థికంగా దెబ్బతీయాలనే ప్రధాని ఆలోచన ధోరణికి ఇది అద్దం పడుతోందని జైరామ్ రమేశ్ విమర్శించారు. రాజ్యాంగ పరిరక్షణ అనేది ఇండియా కూటమి ర్యాలీ లో అత్యంత ప్రధాన అంశమని, రాజ్యాంగాన్ని తిరిగరాస్తామని బిజెపి నేతలు పదే పదే ప్రకటనలు చేస్తున్నారని గుర్తుచేశారు. ఈ ర్యాలీ ఒక వ్యక్తిని పరిరక్షించేందుకు కాదని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలనే ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్నదన్నారు. గడిచిన 75 ఏళ్ళలో ఎలక్టోరల్ బాండ్స్ అతి పెద్ద కుంభకోణమని, దీని ద్వారా బిజెపి రూ.8,200 కోట్లు వసూలు చేసిందని, దీనిపై కూడా ప్రతిపక్ష నేతలు ప్రసంగిస్తారని జైరామ్ రమేశ్ వెల్లడించారు.

## 'ధరణి' ఓ కుట్ర

(మొదటి పేజీ తరువాయి)




కెసిఆర్, కెటిఆర్‌లే బాధ్యులని విమర్శించారు. కెసిఆర్, కెటిఆర్‌లపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. బిఆర్ఎస్ ప్రభుత్వం 22ఎను ఆధారంగా చేసుకొని భూ కుంభకోణానికి పాల్పడిందన్నారు. షామీర్ పేట మండలం తూముకుంట గ్రామంలో 164/1 సర్వే నెంబర్‌లో 26 ఎకరాల అటవీ భూమి జూన్ 2022న ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని తెలిపారు. సర్వే నెంబర్ 260/2, 261, 265/8 361/7 361/9 రక్షణ శాఖ భూమిని బాలాజీ అసోసియేట్స్ అనే సంస్థకు కట్టబెట్టారని చెప్పారు. బొంరాస్ పెట్ గ్రామంలో 1065 ఎకరాల ప్రైవేట్ భూమి అసలైన రైతులకు దక్కకుండా, రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుటుంబానికి చెందిన ఎఫ్ 4 ఎల్ ఫారమ్స్‌కు ధారాదత్తం చేశారన్నారు. రాజ్యసభ సభ్యుడు సంతోష్ 23 ఎకరాల నిషేధిత భూమిని రిజర్వు చేసుకున్నారని అన్నారు. గత ప్రభుత్వం వేల ఎకరాల రైతుల భూములను పూర్తిగా నిషేధిత జాబితాలో పెట్టి, ఎన్నికలు అవ్వవగానే అంబుజ్ అగర్వాల్ పేరున రిజిస్ట్రేషన్ చేశారన్నారు. 24 లక్షల అసైన్డ్ భూమిని నిషేధిత జాబితాలో పెట్టి, వాళ్ళ అనుకూలమైన వ్యక్తులకు కట్టబెట్టారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. హెచ్ఎండిఏను అడ్డుపెట్టుకొని, పేదల భూమిని లాక్కొని వేలం వేశారన్నారు. చేవెళ్ల మండలం చందవెల్లిలో15 వందల ఎకరాలు దళితులు, రైతుల దగ్గర లాక్కొని, ఎకరాకు తొమ్మిది లక్షల చెల్లించారన్నారు. కెటిఆర్ తనకు అనుకూలంగా ఉన్న మల్టీ నేషనల్ కంపనీకి రూ.1 కోటి 30 లక్షలకు అమ్ముకున్నాడని ఆరోపించారు. అన్ని సమగ్ర ఆధారాలతో ప్రభుత్వానికి నివేదిస్తున్నా అన్నారు. టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తాము అప్పటి ప్రభుత్వానికి వీటిపై ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదన్నారు. మాజిల్ పూర్ గ్రామంలో ఆనాడు ల్యాండ్ సీలింగ్‌లో పోయిందని, 25ఎకరాల భూమిని పట్టా చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల కోసం పాటుబడే పార్టీ అన్నారు. అక్రమాలను అన్ని బయట పెట్టి, ప్రభుత్వానికి నివేదిస్తా అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు చేసిన అన్యాయంతో ఎంతో మంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్, కెటిఆర్‌లపై చర్యలు తీసుకోవాలని కోదండ రెడ్డి కోరారు. ధరణి అనేది భూమిని కాజేయడానికి అని సర్వే ఆఫ్ ఇండియా అధికారి చెప్పారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలు జరగగానే, ఎంత పెద్ద వారైనా వదలొద్దని, కఠిన చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డిని కోదండ రెడ్డి కోరారు. రెవిన్యూ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు.

## భారీ పోరాటాలు

(మొదటి పేజీ తరువాయి)

అందరినీ లొంగదిసుకుని, చివరకు మతం సెంటిమెంట్‌తో మౌనంగాఉండేలా చేసిన పరమ నియంత మోడీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీలో హిట్లర్, ఒక ఫాసిస్టు ఉన్నారన్నారు. అప్పట్లో ఇందిరా గాంధీ తాత్కాలికంగా ఎమర్జెన్సీని అమలు చేస్తే, మోడీ మాత్రం నరనరాన మతోన్మాదాన్ని తీసుకెళ్తున్నారని, ప్రస్తుతం ఫాసిజం సమీపం వరకు వచ్చామని తెలిపారు. ప్రతి ఎన్నికల సమయంలో మోడీ ఒక ఆయుదాన్ని బయటికి తీస్తారని, 2018 ఎన్నికల సమయం ముందు పుల్వామా దాడులు, ట్రిబుల్ తలాఖ్, 370 ఆర్టికల్ , ప్రస్తుత 2024 ఎన్నికల్లో శ్రీరాముని మందిరం, ఇంటింటికీ తలంబ్రాల పంపిణీ, 2019లో చట్ట రూపం దాల్చిన సిఎఎను ఇప్పుడు అమలు చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేశారని వివరించారు. నరేంద్రమోడీ అనే కాలనాగులో విషానికి విరుగుడు లేదన్నారు. బిజెపి వద్దకు చేరిన చంద్రబాబుకు మళ్లీ పాత గతి పడుతుందని, మోడీని నమ్మిన కెసిఆర్ పని కూడా అయిపోయిందని కూనంనేని సాంబశివరావు ఎద్దేవా చేశారు. కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడం ద్వారా ఢిల్లీ, పంజాబ్, గోవా రాష్ట్రాలలో ప్రభావం పడుతుందన్నారు. మమత, కెసిఆర్ లాంటి వారు తమ పార్టీలను విస్తరించకుండా, ఇతరులను కూడా మోడీ భయపెట్టారని విమర్శించారు.

**లౌకిక, ప్రజాస్వామ్య విలువలు కాపాడేలా వామపక్ష పార్టీల పోరాటాలు : వీరయ్య**

ఎస్.వీరయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్య, లౌకిక విలువలను కాపాడుకునేందుకు వామపక్ష పార్టీలు పోరాటలు చేసి, ప్రజలలో చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. లౌకిక, ప్రజాస్వామ్య విలువలు ప్రమాదకరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. మతోన్మాద బిజెపి, ప్రధాని మోడీని గద్దె దించేందుకు వామ పక్ష పార్టీలు కలిసి ముందుకు సాగాలన్నారు.దేశంలో కేవలం 81 కోట్ల మందికి పౌష్టికాహారం అందడం లేదని కేంద్ర ప్రభుత్వం స్వయంగా అంగీకరించిందని, ప్రపంచ దేశాల ముందు భారతదేశం ఒక అసమానతలు ఉన్న దేశంగా నిలబడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పోటు రంగారావు మాట్లాడుతూ రాబంధులను తలదన్నేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మరోసారి అధికారంలోనికి వచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కేంద్రంలోని చీకటి పాలనకు వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాటం చేయాలన్నారు. సాదినేని వెంకటేశ్వ రావు మాట్లాడుతూ రాజ్యాంగంలోని కనీస హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అణచివేస్తోందని మండిపడ్డారు. గాదగోని రవి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వామపక్ష పార్టీలు ఏకమవ్వాలని కోరారు. జానీ పాషా, జానకి రాములు మాట్లాడుతూ రాష్ట్రంలో బలమైన వామపక్ష ఉద్యమాన్ని నిర్మించాలన్నారు. సిపిఐ(ఎం.ఎల్.) న్యూడెమోక్రసి నాయకులు మధు మాట్లాడుతూ గిరిజన, ఆదివాసి ప్రాంతా ల్లో ఉన్న 89 రకాల అటవీ సంపను దోచుకునేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చట్టలను సవరిస్తోందని విమర్శించారు. ప్రసాద్ మాట్లాడుతూ కేరళ తరహాలో తెలంగాణ రాష్ట్రంలో కూడా లెఫ్ట్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

## యుద్ధప్రాతిపదికన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేషన్ల పరిధిలలో తాగునీటి కొరతను అధిగమించేందుకు వాటర్ ట్యాంకులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ట్యాంకర్లు బుక్ చేస్తే ఆలస్యం లేకుండా 12 గంటల్లోపు అవసరమైన చోటికి చేరేలా చూడాలని, అం దుకు సరిపడేన్ని ట్యాంకర్లు సమకూర్చుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

**అందుబాటులో డిమాండ్‌కు సరిపడేంత విద్యుత్తు** : ఎండాకాలం కావటంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరిగిందని, అందుకు సరిపడే విద్యుత్‌ను అందించేందుకు విద్యుత్ శాఖ సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. డిమాండ్‌కు సరిపడేంత విద్యుత్తు అందుబాటులో ఉందని, కరెంటు పోయిందనే ఫిర్యాదు రాకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎక్కడైనా సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించాలని సూచించారు. రోజురోజుకు ఎండలు మండుతుండటం విద్యుత్ డిమాండ్ పెరుగుతుండటంతో రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యుత్తు లభ్యత, తక్షణ అవసరాలపై ముఖ్యమంత్రి ఆదేశాలిచ్చారు. గత ఏడాది కంటే రాష్ట్రంలో ఈ ఏడాది అత్యధికంగా విద్యుత్తును సరఫరా చేయడం ద్వారా కొత్త రికార్డును నమోదు చేసిందని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మార్చిలో డిమాండ్ గణనీయంగా పెరిగిందని, పీక్ డిమాండ్ ఉన్నప్పటికీ కోత లేకుండా విద్యుత్తును అందించటంలో డిస్కంలు సమర్థవంతమైన పాత్ర పోషించాయని ముఖ్యమంత్రి ప్రశంసిస్తూ ఉప ముఖ్యమంత్రి, విద్యుత్తు శాఖ మంత్రి భట్టి విక్రమార్కని అభినందించారు. ''గత ఏడాదితో పోలిస్తే డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్తు సరఫరా గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలో సగటున 9712 మెగావాట్ల విద్యుత్తు లోడ్ ఉంటుంది. గత రెండు వారాలుగా 14000 మెగా వాట్ల నుంచి 15000 మెగావాట్ల పీక్ డిమాండ్ ఉంటోంది. ఏప్రిల్ నెల రెండో వారం వరకు ఇంచుమించుగా ఇదే స్థాయిలో డిమాండ్ ఉంటుంది'' అని అంచనా వేసినట్లు విద్యుత్తు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 'గత ఏడాది (2023) జనవరి నుంచి మార్చి వరకు సగటున రోజుకు 239.19 మిలియన్ యూనిట్ల విద్యుత్తు సరఫరా అయింది. 2024 జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలల్లో రోజుకు సగటున 251.59 మిలియన్ యూనిట్ల విద్యుత్తు సరఫరా జరిగింది. గత ఏడాది మార్చి 14న 297.89 మిలియన్ యూనిట్లు సరఫరా అత్యధిక రికార్డు కాగా.. ఈ ఏడాది 308.54 మిలియన్ యూనిట్లతో కొత్త రికార్డు నమోదైంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ గత ఏడాదితో పోలిస్తే విద్యుత్తు సరఫరా మెరుగుపడింది' అని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ వేసవి అవసరాలకు అనుగుణంగా విద్యుత్తు సరఫరా చేసే కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా, పంటలు ఎండిపోకుండా, పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఇబ్బంది తలెత్తకుండా చూడాలని చెప్పారు.

## పివికి భారతరత్న ప్రదానం

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తి పివి. నెహ్రూ–గాంధీ కుటుంబం వెలుపల నుంచి ఐదేళ్ల పదవీ కాలం పూర్తిచేసుకున్న తొలి కాంగ్రెస్ నాయకుడు కూడా పివినే. 1990 ప్రారంభంలో భారతదేశాన్ని కల్లోల భరితమైన సమయంలో నడిపించిన వ్యక్తి పివి నర్సింహారావు. జూన్ 28, 1921న తెలంగాణలోని కరీంనగర్‌లో వ్యవసాయాధారిత కుటుంబంలో పివి జన్మించారు. 1980లలో వేర్వేరు సమయాల్లో కేంద్రంలో ముఖ్యమైన ఆర్థికేతర శాఖలు విదేశీ వ్యవహారాలు, రక్షణ, హోమ్‌శాఖలను నిర్వహించారు. అతను డిసెంబర్ 23, 2004న తన 83వ ఏట మరణించారు. అదే విధంగా మరో ప్రధాని అయిన చౌదరి చరణ్ సింగ్ తరుపున ఆయన మనవడు జయంత్ చౌదరి భారతరత్నను అందుకున్నారు. 'పశ్చిమ ఉత్తరప్రదేశ్‌కు చెందిన జాట్ నాయకుడు అయిన చౌదరి చరణ్ సింగ్ జులై 28, 1979, జనవరి 14, 1980 మధ్య ప్రధానిగా ఉన్నారు. అతను 1987లో మరణించారు. డిసెంబర్ 23, 1902న ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలోని నూర్‌పూర్‌లో మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. మరణానంతరం ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ప్రదానం చేసినట్లు రాష్ట్రపతి భవన్ తెలిపింది. 'ఆహార ఉత్పత్తిలో భారతదేశాన్ని స్వయం సమృద్ధి చేయడంలో స్వామినాథన్ ప్రధాన పాత్ర పోషించారు. ఆయనను 'భారత హరిత విప్లవ పితామహుడు' అని పిలుస్తారు. 'సతత హరిత విప్లవం' అనే తన దృక్పథంతో సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించే పనిలో ఉన్నట్లు రాష్ట్రపతి భవన్ పేర్కొంది. స్వామినాథన్ తరుపున ఆయన కుమార్తె నిత్యారావు అవార్డును అందుకున్నారు.

సెప్టెంబర్ 28, 2023న (98) మరణించిన స్వామినాథన్, 1960లలో ఆహార ధాన్యాల దిగుమతుల కోసం అమెరికాపై ఆధారపడిన కరువు పీడిత దేశం నుండి భారతదేశాన్ని ఆహార ఉత్పత్తిలో స్వయం సమృద్ధిగా ప్రకటించడానికి చాలా విస్తృతంగా కృషి చేశారు. తమిళనాడులోని కుంభకోణంలో ఆగస్టు 7, 1925న డాక్టర్ ఎంకె సాంబశివన్, పార్వతి తంగమ్మాయి దంపతులకు జన్మించిన స్వామినాథన్, రైతులు ప్రాచీన వ్యవసాయ పద్ధతులపై ఆధారపడిన సమయంలో వ్యవసాయ రంగ పథాన్ని మార్చడంలో గణనీయమైన పాత్ర పోషించారు. కాగా, రెండుసార్లు బీహార్ ముఖ్యమంత్రిగా పనిచేసిన కర్పూరీ ఠాకూర్ తరుపున ఆయన కుమారుడు రామ్‌నాథ్ ఠాకూర్ భారతరత్నను అందుకున్నట్లు రాష్ట్రపతి భవన్ వెల్లడించింది.

సోషలిస్ట్ ఐకాన్ ఠాకూర్ డిసెంబర్ 1970 నుండి జూన్ 1971 వరకు, డిసెంబర్ 1977 నుండి ఏప్రిల్ 1979 వరకు బీహార్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఫిబ్రవరి 17, 1988న ఠాగూర్ మరణించారు. ఇదిలా ఉండగా, ఈ సంవత్సరం, ప్రభుత్వం ఐదు భారతరత్న అవార్డులను ప్రకటించింది, అందులో ఒకటి బిజెపి (బిజెపి) ప్రముఖుడు, మాజీ ఉప ప్రధాని ఎల్ కె అద్వానీ ఉన్నారు.

## దక్షిణాదిపట్ల మౌనమెందుకు?

(మొదటి పేజీ తరువాయి)

నాడు విజయన్ ప్రచారం నిర్వహించారు. ఇక్కడ కాంగ్రెస్ తరుపున సిట్టింగ్ ఎంపి శశి థరూర్ బరిలో ఉన్నారు. ఎల్‌డిఎఫ్ ప్రచార సభల్లో విజయన్ ప్రసంగిస్తూ గత లోక్‌సభ ఎన్నికల్లో కేరళలోని 20 స్థానాలలో 19 గెలుచుకున్న కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కూటమి... పార్లమెంటులో కేరళ గొంతును, అభిప్రాయాలను లేవనెత్తలేకపోయిందని విమర్శించారు. ఆ కూటమి ఎంపిలు దక్షిణ రాష్ట్రాల పట్ల ఆర్థిక వివక్ష ప్రదర్శిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరి పట్ల మౌన ప్రేక్షక పాత్ర వహించారని అన్నారు. దేశంలో లౌకికవాదాన్ని అంతం చేసుందుకు కేంద్ర ప్రభుత్వం పదే పదే తీసుకుంటున్న చర్యల ఫలితంగా దశాబ్దాలుగా భారతదేశంలో జీవిస్తున్న పెద్ద సంఖ్యలోని ప్రజలు తాము ఈ దేశంలో జీవనాన్ని కొనసాగించగలుగుతామా? అని ఆందోళన చెందుతున్నారని అన్నారు. దేశంలో కోట్లాది ప్రజలు భయం, సందేహాల నడుమ జీవిస్తున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగా అంతర్జాతీయ సమూహంలో ప్రజాస్వామ్య, లౌకిక దేశమనే భారతదేశ ప్రతిష్టపై ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. ఐక్య రాజ్య సమితి, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి సంస్థలు, అమెరికా, జర్మనీ లాంటి దేశాలు ఇటీవల దేశంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను విమర్శించడమే కాకుండా, ప్రజాస్వామ్య పద్ధతులను అవలంభిస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారని విజయన్ పేర్కొన్నారు. వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) అమలు, లిక్కర్ స్కామ్‌లో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన తీరుపై అనేక దేశాలు, ప్రపంచ సంస్థలు విమర్శలు చేస్తున్నాయన్నారు. కేంద్రం అవలంభిస్తున్న ఆర్థిక విధానాల కారణంగా సంపన్న దేశాల జాబితాలో భారతదేశ స్థానం 55 నుండి 107వ స్థానానికి దిగజారిందని, ప్రపంచదేశాల దృష్టిలో భారత్ పేద దేశమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు సామాన్య ప్రజల ప్రయోజనార్థం కాకుండా ధనికులను మరింత ధనికులుగా మార్చేందుకు ఉపకరిస్తున్నాయన్నారు.

**దేశంలో కేరళలోనే పేదల సంఖ్య తక్కువ**

ప్రపంచంలోనే భారతదేశంలో అత్యధిక మంది పేదలు ఉన్నారని, కేరళలో మాత్రం దేశంలోనే అతి తక్కువ పేదలు ఉన్నారని విజయన్ వెల్లడించారు. సామాన్య ప్రజల సంక్షేమం కోసమే కేరళ ప్రభుత్వం పనిచేయడమే ఇందుకు కారణమని స్పష్టం చేశారు. కేరళ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా సంక్షేమ చర్యలను అడ్డుకునేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, పన్నుల కేటాయింపులో రాష్ట్ర వాటాను తగ్గిస్తోందని, కేరళ రుణ పరిమితికి కోత విధిస్తోందని విజయన్ విమర్శించారు. కేరళ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చాలా దారుణంగా ఉన్నదని, భారీ అప్పులతో రాష్ట్రం మనుగడ సాగిస్తోందని , ఇందుకు వరుసగా అధికారంలో ఉన్న ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్ ప్రభుత్వాలే కారణమని ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆరోపణలను విజయన్ తిప్పికొట్టారు. కేరళ రాష్ట్రంలో ఖర్చు పెడుతున్న ప్రతి రూపాయిలో 75 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా ఉన్నదని, 25 శాతమే కేంద్ర ప్రభుత్వ వాటా అని, భవిష్యత్తులో ఇది 81 శాతం, 19 శాతంగా మారబోతుందన్నారు.

దక్షిణాది రాష్ట్రాలు ఇచ్చేది 35 శాతం.. తిరిగొచ్చేది 15 శాతమే.. దేశంలో దక్షిణ భారత రాష్ట్రాల జనాభా 18శాతం మాత్రమేనని, అయినప్పటికీ దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో ఈ రాష్ట్రాల వాటా 35 శాతమని, కాని కేంద్ర పన్నుల వాటాలో 15 శాతం మాత్రమే దక్కుతున్నదని విజయన్ విమర్శించారు. కాని కాంగ్రెస్ ఈ అంశాన్ని పట్టించుకోకుండా కేవలం రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడంపైనే ఆసక్తి చూపిస్తోందని మండిపడ్డారు. కేంద్ర విధానాలను ప్రశ్నించకుండా కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తున్న తీరు బిజెపికి సహాయపడుతోందన్నారు. ఎలక్టోరల్ బాండ్‌ల వ్యవహారంలో బిజెపి అత్యధికంగా లాభం పొందినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ కూడా రూ.1000 కోట్లకు పైగా నిధులను పొందగలిగిందన్నారు. వామపక్ష కూటమి మాత్రమే మొదటి నుండి ఎలక్టోరల్ బాండ్‌లను వ్యతిరేకిస్తున్నదన్నారు.

## నేటి నుంచి మాజీ సిఎం కెసిఆర్ జిల్లాల పర్యటన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సూర్యాపేట, నల్లగొండ, జనగామ జిల్లాల్లోని పలు మండలాల్లో బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదివారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఎండిపోయిన పంట, పొలాలను కెసిఆర్ పరిశీలించి, అక్కడి రైతులతో మాట్లాడనున్నారు.

## దోచుకుని దాచుకున్నారు...

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి చేశానని, ఈ ఐదు సంవత్సరాల కాలంలో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మాజీ మంత్రి జానారెడ్డి నల్లగొండను అభివృద్ధి చేశారని, కాంగ్రెస్ పార్టీకి జానారెడ్డి ఎంతో సేవ చేశారయని ఆయన కుమారుడైన రఘువీర్‌రెడ్డిని పార్లమెంట్‌కు పంపిస్తామని హామీ ఇచ్చారు.మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, నల్లగొండ ఎంపి అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని పార్లమెంట్‌కు పంపుతామన్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తల పుణ్యమా అని తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని, కాంగ్రెస్ కార్యకర్తలను అన్ని విధాలా గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామన్నారు. కార్యకర్తలకు ఎటువంటి కష్టం వచ్చిన అండగా ఉంటామన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ వస్తుందన్నారు.దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ నా నియోజకవర్గంలో ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో 32వేల మెజార్టీ వచ్చిందని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రఘువీర్‌రెడ్డికి 64వేల మెజార్టీ వచ్చేలా కష్టపడి పనిచేస్తానన్నారు. ఘువీర్‌రెడ్డిని దేశంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని పార్లమెంట్‌కు పంపిస్తామని ఆయన అన్నారు.నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని, నన్ను పార్లమెంట్‌కు పంపించి నా యొక్క బాధ్యత నాకు తెలియజేయాలని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎటువంటి కష్టం వచ్చిన ముందుండి వారి కష్టాలను తీరుస్తానని, మా తండ్రి ఆదరించినట్లే నల్లగొండ జిల్లా ప్రజలు మమ్మల్ని ఆదిరించాలని ఆయన అన్నారు.దేశంలోనే అత్యధిక ఓట్ల మెజార్టీతో నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థిగా తనను గెలిపించాలని ఆయన కార్యకర్తలను కోరారు.కార్యక్రమంలో మాజీ మంత్రులు కుందూరు జానారెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి,డిసిసి అధ్యక్షులు శంకర్ నాయక్, చెవిటి వెంకన్నయాదవ్, రాష్ట్ర టూరిజం చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'బిజెపి మోడీ వాషింగ్ పౌడర్'

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్‌పార్టీ నాయకుడు ప్రఫుల్ పటేల్‌పై సిబిఐ కేసు దాఖలు చేసింది. ఆ తదనంతర పరిణామాలపై కాంగ్రెస్‌పార్టీ సింబాలిక్‌గా పత్రికాగోష్ఠిలో వాషింగ్ మెషీన్‌ను తెచ్చి ప్రదర్శించి వ్యంగ్యాస్త్రాలు సంధించింది. బాగా మురికిపట్టిన అవినీతి, మోసం, కుంభకోణాలు అనే పేర్లు రాసి ఉన్న ఒక టీ–షర్ట్‌ను వాషింగ్ మెషీన్‌లో వేసి జాడించి తర్వాత దాన్ని బయటకు తీశారు. లోపలి నుండి తీసిన ''బిజెపి మోడీ వాష్' అనే పేరుతో ఉన్న మరో టీ–షర్టును పత్రికాగోష్ఠిలో పార్టీ ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా మీడియాకు ప్రదర్శించారు. అన్ని రకాల అవినీతికి, మోసాలను తుడిచిపెట్టేవిధంగా ఈ ''బిజెపి మోడీ వాష్'' ఎంతో సమర్థవంంగా పనిచేస్తుందని సెటైర్లు వేశారు. బిజెపి ఇప్పటివరకూ ఈ విధంగా 21 మంది పెద్ద నాయకులపై వచ్చిన అవినీతి ఆరోపణలను ఆ పార్టీలో చేరాక తుడిచిపెట్టి వారికి క్లీన్ చిట్ మంజూరు చేసిందని పవన్‌ఖేరా విమర్శించారు. అవినీతిపరులకోసం బిజెపి వాడుతున్న వాషింగ్ మెషీన్ ఖరీదు 8,500 కోట్ల రూపాయలని ఖేరా విమర్శించారు. ఎన్నికల బాండ్ల ద్వారా బిజెపి దండుకున్న సొమ్ము విలువను వాషిన్ మెషీన్ ఖరీదుగా పేర్కొంటూ ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఎన్నికల బాండ్ల ద్వారా దందాలకు పాల్పడి రూ.8,500 కోట్లు దండుకున్న బిజెపి ప్రతిపక్షాలను ఇక్కట్లకు గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి ఈ అవినీతి పరులను తమ పార్టీలోకి చేర్చుకుని క్లీన్ చిట్ ఇస్తోందని విమర్శలతో ఎండగట్టారు. దర్యాప్తు సంస్థల ద్వారా కేసులు ఎదుర్కొనే నాయకులు బిజెపిలో చేరడం ద్వారా పరిశుద్ధమైన వ్యక్తులుగా మారిపోతున్నారని పవన్ ఖేరా విమర్శించారు. ఈ కేసులను బిజెపి మాఫీ చేస్తున్నదని ఆయన అన్నారు. అదేసమయంలో ప్రతిపక్షాలపై కేసులు పెట్టి తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నదని అన్నారు. ఆదాయపన్నుశాఖ ద్వారా మరోసారి కాంగ్రెస్‌పై వేధింపులు ప్రారంభమైన పూర్వరంగంలో ఆయన ఈ విమర్శలు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వ్యవహారాలలో నీతి తప్పి వ్యవహరించిన అధికారులందరిపైనా గురి పెడుతుందని హెచ్చరిచారు. దేశ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేవిధంగా, రాజ్యాంగం విలువలను దిగజార్చేవిధంగా ప్రవర్తించిన ప్రతి ఒక్క అధికారిపైనా చర్యలుంటాయని ఆయన పరోక్ష హెచ్చరిక చేశారు.

**బిజెపి ఏం సమాధానం చెబుతుంది?**

ప్రఫుల్ పటేల్ అవినీతి పరుడని పదేళ్ళనాడు బిజెపి విమర్శలుచేసిందని పవన్ ఖేరా గుర్తు చేశారు. ఎన్‌సిపిని చీల్చుకుని మహారాష్ట్రలోని బిజెపి కూటమిలో చేరిన తర్వాత 2017లో ప్రఫుల్ పటేల్‌పై పెట్టిన కేసులు మూసేస్తున్నట్లు సిబిఐ ఒక నివేదిక ప్రకటించింది. 2014 లో బిజెపి విడుదల చేసిన చార్జిషీటులో కూడా పటేల్ అవినీతిని ఎండగట్టింది. ఆ తర్వాత ఆయన బిజెపి కూటమిలో చేరారు. యుపిఎ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బిజెపి 2014లో ఒక చార్జిషీటు విడుదల చేసింది. ఎయిర్ ఇండియా స్కామ్‌గా దానిని పేర్కొంది. ఈ మొత్తం అవినీతి రూ.30వేల కోట్ల మేరకు ఉంటుందని ఆనాడు బిజెపి ఆరోపించింది. సిబిఐ తన దర్యాప్తులో పటేల్ 2006లో కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రిగా తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని పేర్కొంది. ఐదేళ్ళపాటు ఎయిర్ ఇండియా ఎయిర్‌క్రాఫ్ట్‌లను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేశారని సిబిఐ పేర్కొంది. 1993లో జరిగిన ముంబయి బాబుపేలుళ్ళ కేసుకు సంబంధించి ఆస్తి వ్యవహారాల్లో పటేల్ భాగస్వామిగా ఉన్నారని కూడా బిజెపి ఆరోపించింది. ఈ విషయాలన్నింటినీ పవన్ ఖేరా పత్రికాగోష్టిలో మీడియాకు మరోసారి గుర్తుచేశారు. ఆనాడు బిజెపి జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా కాంగ్రెస్‌పై విరుచుకుపడుతూ, ''మీరు వచ్చి పటేల్, ఇగ్బాల్ మిర్చిలపై ఉన్న భూమి తాలూకూ ఆరోపణలను తుడిచిపెట్టండి'' అని అన్నారని, గ్లోబల్ టెర్రరిస్టుగా ప్రకటించిన దావూద్ ఇబ్రహీంకు ఇబ్రహీం మిర్చి సన్నిహితుడనీ ఆయన గుర్తుచేస్తూ ఈ విధమైన నేరపూరిత ఆరోపణలన్నీ వారి విషయంలో ఏమైపోయాయని, ఈ పరిస్థితులకు బిజెపి ఏం సమాధానం చెబుతుందని పవన్ ఖేరా నిలదీశారు. ఆనాడు బిజెపి చేసిన ఆరోపణలన్నీ ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు.



టిడిపి నాయకురాలు, నందమూరి హరికృష్ణ కుమార్తె నందమూరి సుహాసిని హైదరాబాద్‌లోని సిఎం నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

## క్రమశిక్షణ రాహిత్యాన్ని ఉపేక్షించేది లేదు : రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్:పార్టీ అంతర్గత వ్యవహారాలు, క్రమశిక్షణ రాహిత్యాన్ని ఉపేక్షించేది లేదని టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హెచ్చరించారు. టిపిసిసి ఎగ్జిక్యూటివ్ సమావేశంలో నాయకుల మధ్య ఏర్పడిన అభిప్రాయ బేధాలు, ఫిర్యాదులను పరిష్కరించేందుకు'' పార్లమెంట్ ఎన్నికల ఫిర్యాదుల పరిష్కార ''కమిటీని రేవంత్ రెడ్డి శనివారం ప్రకటించారు. ఈ కమిటీలో మాజీ సిఎల్‌పి నేత కె. జానారెడ్డి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ ఉన్నారు. రాష్ట్రంలో నాయకులకు ఎటువంటి ఫిర్యాదులు ఉన్న కమిటీ దృష్టికి తీసుకెళ్లాలని,వాటిని పరిష్కరించేందుకు పార్టీ సిద్ధంగా ఉన్నదని రేవంత్ రెడ్డి తెలిపారు.

## నిబంధనలకు విరుద్ధంగా మోడీ వ్యవహారం



ప్రజాపక్షం/హైదరాబాద్: ఎన్నికల నియమ నిబంధనలకు విరుద్ధంగా ప్రధాని మోడీ వ్యవహరిస్తున్నారని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయం లో ప్రధాని మోడీ చాయ్ పే చర్చ చేస్తున్నారని, బిలిగేట్స్ తోచాయ్ పే చర్చ చేశారని విమర్శించారు. గాంధీ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ప్రభుత్వానిది కేర్ ప్రభుత్వం మాత్రమేనన్నారు. బిలిగేట్స్ తో తనకు సాన్నిహిత్యం ఉన్నదని ఓటర్లను నమ్మించే డ్రామాకు మోడీ తెరలేపారని, ఇది ఎన్నికల కోడ్‌కు విరుద్ధమని చెప్పారు.

## బిఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌ను స్టార్ హోటల్‌గా పెట్టుకుంటే మంచి వ్యాపారం

### కాంగ్రెస్ ఎంఎల్‌ఎ మేడిపల్లి సత్యం ఎద్దేవా



ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్ఎస్‌కు చెందిన తెలంగాణ భవన్‌లో పార్టీ ఆఫీస్‌ను మూసి, స్టార్ హోటల్‌గా పెట్టుకుంటే, మంచి వ్యాపారం నడుస్తుందని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ మేడిపల్లి సత్యం ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెటిఆర్, హరీష్ రావు నీతిమంతుల్లా మాట్లాడుతున్నారని, లోక్‌సభ ఎన్నికల తర్వాత బిఆర్ఎస్ కనుమరుగు కాబోతుందన్నారు. కల్వకుంట్ల కుటుంబ నేతలను మించిన పవర్ బ్రోకర్లు ఇంకెవరు లేరని, పది సంవత్సరాలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన చరిత్ర బిఆర్ఎస్‌దేనని అన్నారు. తాము చేస్తే సంసారం, వేరే వారు చేస్తే వ్యభిచారంలాగా హరీశ్ రావు, కెటిఆర్ ప్రవర్తిస్తున్నారని చెప్పారు. బిఆర్ఎస్ పాలనలో సొంత పార్టీ ఎంఎల్‌ఎలు, ఎంపిలను కూడా కలవని నీచ చరిత్ర కెసిఆర్‌ది అని మండిపడ్డారు. బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలను చేర్చుకోవలని సిఎం రేవంత్ రెడ్డి తలచుకుంటే, 24గంటల్లో బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలు ఖాళీ అవుతారని చెప్పారు.



## కెసిఆర్‌పై కోపంతో రైతులను బలి పెడుతున్న కాంగ్రెస్

ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి : రాష్ట్రంలో రైతుల కష్టాలు చూడలేక ఆరోగ్యం బాగా లేకున్నా మాజీ సిఎం కెసిఆర్ అన్నదాతల వద్దకు వస్తున్న సిఎం రేవంత్ రెడ్డికి పరిపాలనపై సోయి లేదని ఇప్పటివరకు వ్యవసాయంపై సమీక్ష కూడలేదని ఇలాంటి విపత్కర పరిస్థిలల్లో కెసిఆర్ ఉంటే భూమి ఆకాశం ఒక్కటి చేసైనా సరే అన్నదాతలకు నీళ్లు అందించే వారు అని మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలో మాజీ ఎంఎల్‌ఏ కంచర్ల భూపాల్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ రాష్ట్రంలో నీళ్లు అందక లక్షల ఎకరాలు ఎండిపోయాయి . రైతులకు నీళ్లు ఇచ్చే అవకాశం వున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల అన్నదాతలు ఆగం అయ్యారన్నారు. కెసిఆర్‌పై కోపంతో కాంగ్రెస్ వాళ్ళు రైతులను బలి పెట్టారు అని ఆరోపించారు. జిల్లాలో ఆదివారం మాజీ సిఎం కెసిఆర్ జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో రైతులు, ప్రజలు పర్యటనలో భాగస్వాములు కావాలని కోరారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ ఎంసి కోటిరెడ్డి, రాజసభసభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, ఎంపి అభ్యర్థి కంచర్ల కృష్ణా రెడ్డి, మాజీ ఎంఎల్ ఏలు కంచర్ల భూపాల్ రెడ్డి, భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## అవకాశమిస్తే వరంగల్ ఎంపిగా పోటీ ఎర్రోళ్ల శ్రీనివాస్



ప్రజాపక్షం/హైదరాబాద్: కెసిఆర్ తనకు అవకాశమిస్తే వరంగల్ లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తానని బిఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ తెలిపారు. తాము త్యాగాలు చేస్తే, ప్రస్తుతం పార్టీ వీడుతున్న వారు భోగాలు అనుభవించారని విమర్శించారు. తెలంగాణభవన్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పదవులు అనుభవించి, అవకాశాలు పొందిన తర్వాత పార్టీ మారుతున్నారని, కడియం కారణంగానే రాజయ్య, అరూరి రమేష్, పసునూరి దయాకర్ పార్టీకి దూరమయ్యారని ఆరోపించారు. బిఆర్ఎస్ తీర్థయాత్ర లాగా కనిపిస్తుందా అని కెకెను ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు కూడా అప్రమత్తంగా ఉండాలని, తమ లాంటి వారిమి నష్ట పోయామని, 'మీరూ' నష్టపోవద్దని సూచించారు.

**కెటిఆర్ మాటలకు వక్రభాష్యం: వివేకానంద**

ఫోన్ ట్యాపింగ్ అంశంలో కెటిఆర్ మాటలకు వక్ర భాష్యం చెబుతున్నారని బిఆర్ఎస్ ఎంఎల్‌ఎ కె.పి.వివేకానంద అన్నారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు.

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం, మంత్రులు తమ సత్యదూరమైన మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కూడా వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారన్నారు. కెసిఆర్ వయసుకు కూడా రేవంత్ రెడ్డి గౌరవం ఇవ్వడంలేదన్నారు.

# రాష్ట్రంలో విద్య, వైద్యాన్ని పునరుద్ధరించాలి

### పలువురు వక్తల ఉద్ఘాటన

### 'కాంగ్రెస్ పార్టీ 100 రోజుల పాలన'పై ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం



ప్రజాపక్షం/హైదరాబాద్: గత ప్రభుత్వ హయంలో నిర్వీర్యమైన విద్య, వైద్యాన్ని కొత్తగా పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలని పలువురు వక్తలు అన్నారు. 'ప్రజాతంత్ర' దినపత్రిక 26వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 'కాంగ్రెస్ పార్టీ 100 రోజుల పాలన'పై ప్రజాసంఘాల 'నిగాహ్' పేరుతో హైదరాబాద్ సైఫాబాద్ స్మామ్ట్ కాంప్లెక్స్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో శనివారం రౌండ్ టేబ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి విశ్రాంత అధ్యాపకురాలు ప్రొఫెసర్ రమా మెల్కోటే అధ్యక్షత వహించారు. టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండ రామ్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, ఎంవిఎఫ్ ప్రతినిధి ఆర్. వెంకట్ రెడ్డి, దళిత విమెన్స్ కలెక్టివ్ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, ముస్లీం జెఎసి నాయకులు ఖలీదా పర్వీన్, మహిళా ట్రాన్స్‌జెండర్ సంఘాల జెఎసి ప్రతినిధి ముద్రబోయిన రచన, తదితర ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రమా మెల్కోటే మాట్లాడుతూ ప్రజా సంఘాల పోరాటంతోనే తెలంగాణ వచ్చిందన్నారు. వచ్చిన తెలంగాణలో నిరంకుశంగా పాలనసాగిందన్నారు. నిరంకుశ ప్రభుత్వాన్ని ప్రజాసంఘాల పోరాటంతో గద్దె దిగిందని చెప్పారు. కొత్త ప్రభుత్వమైన విద్య, ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాల్సిన అవసరం ఉందని సూచించారు. గత ప్రభుత్వం ఒయుకు కనీస మౌలిక సౌకర్యాల కోసం నిధులు కూడా విడుదల చేయలేదన్నారు. విద్య నిర్వీర్యం అయిందన్నారు. విద్య, ఆరోగ్యం కోసం ఉద్యమాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. మూసీనది అభివృద్ధి పేరిట, ల్యాండ్ పులింగ్ విధానంలో భూసేకరణ చేయనున్నారని, పత్రికలలో వార్తలు వచ్చాయన్నారు. ప్రజలకు లాభం కలుగుతుందా? నష్టం జరుగుతుందా? అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉందన్నారు. రైతులకు ఎంఎస్‌పి ఇస్తామని చెప్పుతున్నారని, కానీ అమలు చేయడం లేదని చెప్పారు. ప్రాజెక్టు ఏర్పాటు పేరుతో వికారాబాద్‌లో 12 లక్షల చెట్లను నరికేస్తున్నారని తెలిపారు. ఈ చర్య పర్యావరణానికి పెను ప్రమాదంగా పరిణమించే అవకాశం ఉందన్నారు. దీనిని ప్రజా సంఘాలు అడ్డుకోవాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వంద రోజుల పనితీరు అంచనా వేయడం ప్రమాణికం కాకపోవచ్చు అని అన్నారు. అధికారం లేకపోతే నేతలు ఉండలేకపోతున్నారని, ప్రస్తుతం జరుగుతున్న వలసలే ఇందుకు నిదర్శనమని చెప్పారు. మనుగడ సాగించేందుకు సిఎం రేవంత్ రెడ్డి బలాన్ని సమకుర్చుకునేందుకు బిఆర్ఎస్‌ను ఖాళీ చేస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్‌ను ఖాళీ అయితే ఆ స్థానంలోకి బిజెపి వస్తుందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే సిఎం రేవంత్ రెడ్డికి ప్రజా సమస్యలు పట్టించుకునే సమయం లేకుండా పోయిందన్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరమే నిజమైన కాంగ్రెస్ పాలన మొదలవుతుందని తెలిపారు. అయితే ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి పెట్టాల్సిందే అన్నారు. ఇప్పటి వరకు రైతు బంధు 92 శాతం అమలైందన్నారు. అయితే ప్రభుత్వం వద్ద తగిన వనరులు లేవని చెప్పారు.

వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని, ఈ వందరోజులలో గత ప్రభుత్వ నిర్బంధ కాండనే పోలీసులు అమలు చేస్తున్నారని విమర్శించారు. సెక్షన్ 30, 144 కింద కనీసం ఊరేగింపులకు కూడా అనుమతులు ఇవ్వడం లేదన్నారు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలిపేందుకు ఊరేగింపు జరుపుతామని చెప్పితే పోలీసులు అనుమతులు ఇవ్వలేదని చెప్పారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో హైకోర్టు ఏర్పాటుకు వ్యతిరేకంగా ఎబివిపి విద్యార్థులు ఆందోళన చేస్తే పోలీసులు లాఠీ చార్జ్ చేశారన్నారు. ఎన్ఐఎ సోదాలు కొనసాగుతునే ఉన్నాయని, కేంద్రం, రాష్ట్రం, పక్క రాష్ట్రాల పోలీసులు తెలంగాణలో దాడులు కొనసాగిస్తునే ఉన్నారని తెలిపారు. ఎస్ఐబి నరహంతక ముఠా ఆగడాలు మితిమిరిపోయాయన్నారు. గతంలో ఎస్ఐబి ముంబాయి, భువనేశ్వర్, ఓరిస్సాలలో స్థావరాలు నడిపిందని చెప్పారు. లెక్క పత్రం చూపించనవసరం లేకుండా విచ్చలవిడిగా ఖర్చు చేశారన్నారు. 30 సంవత్సరాల ఎస్ఐబి పనితీరును సమీక్షిస్తారా?, కాంగ్రెస్ ప్రభుత్వం ఏమైనా మార్పు తెస్తుందా? చూడాలని అన్నారు.

# 'రజాకార్' సినిమా నిషేధించాలి

### ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర




ప్రజాపక్ష ం/ హైదరాబాద్ : చరిత్రను వక్రీకరిస్తూ మతాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా ఉన్న రజాకార్ సినిమాను నిషేధించాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలీ ఉల్లా ఖాద్రీ కె. ధర్మేంద్ర డిమాండ్ చేశారు. మత విద్వేషాలు రెచ్చగొడుతున్న దుష్టశక్తుల ఆగడాలను తెలంగాణలో సాగనీయమని అన్నారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన ఎఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు సమావేశంలో ఖాద్రీ, ధర్మేంద్ర మాట్లాడుతూ గుజరాత్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాలలో బిజెపి ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొడుతూ, చీలికలు తెచ్చి అశాంతిని నెలకొల్పిందన్నారు. అవే విధానాలను తెలంగాణ లో కూడా అమలు చేయాలని , ప్రజల మధ్య మతం ఘర్షణలు సృష్టించాలని కుట్రలు పన్నుతున్నదని విమర్శించారు. ఇటీవల మేడ్చల్ జిల్లా చెంగిచర్ల ప్రాంతంలో జరిగిన ఘటన అదే కోవలోకి వస్తుందని, రెండు మతాల మధ్య వైరుధ్యాలను సృష్టించి ఘర్షణలకు బిజెపి తెర లేపిందని ఆరోపించారు. కేవలం ఎన్నికల సమయంలోనే ఇలాంటి నీచపు అకృత్యాలకు పాల్పడటం సిగ్గు చేటు అన్నారు. రజాకార్ సినిమాలో తప్పుడు చరిత్రను చూపిస్తున్నారని ధ్వజమెత్తారు. నిజాం వ్యతిరేక పోరాటం అంటే మతాన్ని, హిందూ ధర్మాన్ని, సనాతన ధర్మాన్ని రక్షించడానికి గ్రామాల్లో ప్రజలు తిరుగుబాటు చేశారనే అబద్దాలు చెప్పారని, కావాలనే ఒక వర్గం పట్ల వ్యతిరేక నినాదాలు చేర్చి ఈ సినిమాలో చూపించారని ధ్వజమెత్తారు. 'మనుషలను చంపగలరు కానీ మా మతాన్ని, హిందువులను చంపలేరు' అనే డైలాగులతోనే వివాదం చేస్తున్నారన్నారు.ఆనాడు ప్రజలు సాధారణంగా ఆంధ్ర మహాసభ జిందాబాద్ అన్నారే, కానీ, కనీస ప్రస్తావన లేని 'వైదిక మతం జిందాబాద్' అనే నినాదాలు గ్రామాలలో ఇచ్చినట్లు, ఈ సినిమాలో చూపించారన్నారు.

'మత కోణంలోనే ఈ పోరాటం జరిగితే విస్నూర్ రాంచంద్ర రెడ్డి గుండాలు చంపిన షేక్ బందగీ, రజాకార్లు చంపిన ముస్లిం జర్నలిస్ట్ షోయబుల్లా ఖాన్ ఎవరో చెబుతారా? గ్రామాల్లో అరాచకాలకు కేరాఫ్ అడ్రస్ అయిన రజాకార్ల సైన్యానికి అధ్యక్షుడు ఖాసిం రజ్వీ అయితే, ఉపాధ్యక్షుడు విస్నూరు రామచంద్రారెడ్డి అనేది తెలియదా? ప్రజలపై దాడులు చేయించిన,ప్రజలను పీడించిన రజాకార్లకు విడిది ఈ దొరల గడీలే అన్న సంగతి తెలియదా? అన్నదమ్ములాగ కలసి అన్ని మతాల, కులాల వారు చేసిన వీరోచిత పోరాటానికి మతం రంగు పులిమే ఎవరైనా దేశ భక్తులు ఎలా అవుతారని ' వారు ప్రశ్నించారు. అశేష త్యాగాలు చేసిన కమ్యూనిస్టుల త్యాగాల గురించి ఈ సినిమాలో ఎక్కడా చూపించలేదని విమర్శించారు. కమ్యూనిస్టుల నాయకత్వంలోనే ప్రజలు గ్రామ రక్షణ దళాలను ఏర్పాటు చేసుకోని పోలీసు, రజాకార్ల దాడులను తిప్పికొట్టారని గుర్తుచేశారు.

గెరిల్లా దళాలు ఏర్పాటు చేసి బందూకు శిక్షణ నేర్పింది కమ్యూనిస్టులేని వారు ఉద్ఘటించారు. దీంతో దొరలు గ్రామాల నుండి పారిపోయారని, కమ్యూనిస్టులు భూసంస్కరణలు అమలు జరిపి 10 లక్షల ఎకరాల భూమి పంచారన్నారు.వెట్టి చాకిరి, బానిస విధానం రద్దైంది, రుణాలు, రుణ పత్రాలు, అప్పులు, వడ్డీలు రద్దయ్యాయని, స్త్రీలకు సమాన హక్కులు కల్పించబడ్డాయన్నారు. అసలైన చరిత్ర పేరుతో ఈ వక్రీకరణలను చేస్తున్న కుట్రలను తెలంగాణ రాష్ట్ర యువత, ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సామావేశంలో ఎ ఐ వై ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ కునుకుంట్ల శంకర్, బిజ్జ శ్రీనివాసులు, టి. సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం సమీపంలో మావోయిస్టుల పోస్టర్లు

ప్రజాపక్షం/భద్రాచలంః భద్రాచలం సమీపంలో గల ఆంధ్రా బోర్డలైన కన్నాయిగూడెంలో శనివారం మావోయిస్టు పోస్టర్లు వెలిశాయి. ఆదివాసీలను విచ్ఛిన్నం చేసే విధంగా దేశ, విదేశీ బహుళ జాతి కార్పోరేట్ కంపెనీల మైనింగ్స్, ప్లాంట్లు, రోడ్లు, డ్యాంలు, టైగర్ జోన్‌లు, అభయారణ్యాలు వంటి ప్రాజెక్టులను నలిపి వేయాలని భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్‌ల మావోయిస్టు కమిటీ పేరుతో ఆ కరపత్రాల్లో రాశారు.

ఆదివాసీల స్వయం ప్రతిపత్తికి భంగం కలిగించే విధంగా, ఉద్యమాలను అణిచివేసే విధంగా కార్పెట్ సెక్యూరిటీ పోలీస్ క్యాంపులను, పారా మిలటరీ బలగాలను ఎత్తివేయాలని లేని పక్షంలో ప్రతీకార చర్యలు తప్పవని ఆ కరపత్రాల ద్వారా మావోయిస్టులు హెచ్చరించారు.

## బిజెపి గేట్లు తెరిస్తే 48 గంటల్లో కాంగ్రెస్ పార్టీ ఖాళీ

### ఏలేటి మహేశ్వర్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: తమ ఎంఎల్‌ఎలలో ఏ ఒక్కరి ని ముట్టుకున్నా, 48 గంటల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి ఎంఎల్‌ఎలు కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్నారంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ 'మీ తమ్ముడు రాజగోపాల్ రెడ్డి మీతో' టచ్‌లో ఉన్నారో లేదో తెలుసుకోవాలని అన్నారు. బిజెపి గేట్లు తెరిస్తే 48 గంటల్లో కాంగ్రెస్ పార్టీ ఖాళీ అవ్వడం ఖాయమన్నారు. ఏ మంత్రి ఎప్పుడు తన సీటుకు ఎసరు తెస్తారోనని సిఎం రేవంత్ రెడ్డికి భయంతో నిద్ర పట్టడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేక కాంగ్రెస్ పార్టీ అభద్రతా భావంలో ఉన్నదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణను సిబిఐకి ఎందుకు అప్పగించడం లేదని ప్రశ్నించారు. టెలిఫోన్ ట్యాక్ట్ కేంద్ర ప్రభుత్వానికి సంబంధించినదని, ఈ కేసును సిబిఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. రేవంత్ వసూళ్ల చిట్టా బిజెపి నాయకుల వద్ద ఉందన్నారు.

# బిజెపి నేతలు ఏమైనా జ్యోతిష్కులా?

### మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రభుత్వాన్ని కూలగొడతామనడం మీరు ఏమైనా జ్యోతిష్యులా అని బిజెపి శాసనసభ పక్షనేత మహేశ్వర్ రెడ్డిని ఉద్దేశించి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 1987 లో డిగ్రీ కాలేజీలో ఎబివిపిపై గెలిచిన వ్యక్తిని అని, కలలో కూడా బిజెపి ఊసెత్తను అన్నారు. బిజెపి కూడా బలహీన వర్గాల ముఖ్యమంత్రి అన్నారని, ఉన్న బిసి అధ్యక్షుడిని తొలగించారని అన్నారు. బిసి వర్గాలకు న్యాయం చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

కాంగ్రెస్‌ని టచ్ చేసి చూడాలని బిజెపికి సవాల్ విసిరారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా పాలన తమదన్నారు. చేతనైతే పదేళ్లలో ఏం చేశారో ప్రజలకు చెప్పాలని బిజెపి నేతలను మంత్రి నిలదీశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రధాని నరేంద్ర మోడీ అవమానించారని తెలిపారు. దానిపై మీరు మాట్లాడారన్నారు. తెలంగాణ విభజన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు.

పదేళ్లు బలహీన వర్గాలకు ఏం చేశారో చర్చకు సిద్ధమా అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. తమ నాయకుడు రాహుల్ గాంధీ చెప్పిన విధంగా అసెంబ్లీలో కుల గణన తీర్మానాన్ని చేశామని తెలిపారు. గాంధీ భవన్‌లో శనివారం మీడియాతో పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మాజీ మంత్రి కెటిఆర్ రాజకీయాల్లోకి రాకముందు రాజకీయాల గురించి మాట్లాడితే తెలియదు కావచ్చు అనుకున్నామని, పదేళ్లు మంత్రిగా, ముఖ్యమంత్రి కుమారుడిగా అధికారం వెలగబెట్టిన కెటిఆర్ అన్ని అబద్దాలు మాట్లాడుతుండని మండిపడ్డారు. సూటి ప్రశ్న అడుగుతున్న కెటిఆర్ 23 ఏళ్ల నుండి బిఆర్ఎస్ పెట్టినప్పటి నుండి ఇప్పటి వరకు ఒక్క బలహీన వర్గానికి చెందిన వారైన అధ్యక్షుడు అయ్యారా? అని ప్రశ్నించారు.

ముఖ్యమంత్రి అయిన తరువాతైనా మీ పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వాల్సింది అని అన్నారు. మీ పార్టీ అధ్యక్ష పదవి, కార్యనిర్వాహక అధ్యక్ష పదవి, శాసన సభ పక్ష పదవి ఒకరైనా బలహీన వర్గాలకు చెందిన వారు ఉన్నారా అన్నారు. 23 సంవత్సరాల చరిత్రలో బలహీన వర్గాలకు ఒక్క పదవి ఇచ్చిన పరిస్థితి బిఆర్ఎస్ ప్రభుత్వంలో లేదన్నారు.

**కాంగ్రెస్ పార్టీతోనే బలహీన వర్గాలకు న్యాయం..**

కాంగ్రెస్ పార్టీతోనే బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బలహీన వర్గాల సంక్షేమానికి రూ. 150 కోట్లు విడుదల చేశామని, 17 కులాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. బలహీన వర్గాలకు ఏమైనా జరిగితే అడిగే హక్కు తమకుందన్నారు. బిసి బంధు పేరుతో లక్షల దరఖాస్తులు తీసుకొని, కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు చేశారని విమర్శించారు.

గొర్రెలు అన్నారని, వాటి లెక్కలు చూస్తే ఆశ్చర్యం కలుగుతుందన్నారు. డిసెంబర్‌లో అధికారంలోకి వస్తే మార్చి 30 లోపు బలహీన వర్గాలకు ఇంత చేశామన్నారు. బిసిలకు విదేశీ విద్య సహాయం చేసే వారికి పెంచేలా చూస్తున్నామన్నారు. రాజకీయ పరమైన మార్పులు, చేర్పులు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ న్యాయం చేసిందన్నారు.



## కడియం వెంటే అభిమానులు

ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి : మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కడియం కావ్య నాయకత్వాన్ని బలపరుస్తూ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలంతా హైదరాబాద్‌లోని కడియం శ్రీహరి నివాసంలో డాక్టర్ కడియం కావ్యలకు మద్దతు తెలిపేందుకు భారీగా వెళ్లారు. ఈ సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు, గ్రామాల నాయకులు, కార్యకర్తలు కడియం శ్రీహరి, డాక్టర్ కడియం కావ్యలను మర్యాదపూర్వకంగా కలుసుకొని వారికి తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని అన్నారు. అనంతరం మీ వెంటే మేము అంటూ కదిలివచ్చిన ప్రజాప్రతినిధులు, నాయకుతో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కడియం కావ్య సమావేశమయ్యారు. కార్యకర్తల అభీష్టం మేరకే తాము నిర్ణయం తీసుకుంటున్నామని,కాంగ్రెస్ లోకి రావాలని ఏఐసీసీ నాయకులు కోరారని చెప్పారు.గడిచిన పదేళ్లుగా అధికారంలో ఉన్నా ప్రతిపక్షం మాదిరిగానే స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం పరిస్థితి ఉందని, ప్రస్తుతం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ పరిస్థితి బాగా లేదని, ఎన్నికలలో ఎవరూ సహకరించడం లేదని, తన కూతురు కడియం కావ్యను ఓడిపోయే పార్టీ నుండి మొదటి సారిగా నిలబెట్టలేనని అన్నారు. తన లాగే తన కూతురు ఆశీర్వదించాలని కడియం శ్రీహరి కోరారు.

# కాంగ్రెస్‌లో కాక

### ఉత్కంఠగా మారిన ఓరుగల్లు రాజకీయాలు



ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి : ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్ఎస్‌ను పీడి కాంగ్రెస్‌లో చేరుతుండడం కాంగ్రెస్‌లో కాక రేపుతున్నది. కడియం రాకను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ నాయకుల, కార్యకర్తల ఆందోళనతో జిల్లాలో రాజకీయాలు మరింత వేడిని రాజుకుంటున్నాయి. కడియం రాకను వ్యతిరేకిస్తూ శనివారం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన కూడా నిర్వహించారు.ముఖ్యంగా కాంగ్రెస్ నుండి వరంగల్ లోక్‌సభ టికెట్ ఆశించిన స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇంచార్జీ సింగపురం ఇందిర స్టేషన్ ఘన్‌పూర్ కార్యకర్తలు,నాయకులతో సమావేశమై కడియం రాకను వ్యతిరేకిస్తూ టీపీసీసీ,ఏఐసీసీ అగ్ర నాయకుల వద్ద ఆందోళన చేపట్టాలని నిర్ణయించారు. ఇందిరతో పాటు ఇప్పటివరకు వరంగల్ ఎంపి టికెట్ ఆశిస్తున్న సీనియర్ నాయకులు దొమ్మాటి సాంబయ్య, రామగళ్ల పరమేశ్వర్, జన్ను పరంజోతి, బీఆర్ఎస్ నుండి కంగ్రెస్‌లో చేరిన సిట్టింగ్ ఎంపి పసునూరి దయాకర్ తదితరులలో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. మరోవైపు కడియం శ్రీహరి కారణంగానే టికెట్ రాక బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ప్రస్తుతం యూటర్న్ తీసుకోనున్నట్లు తెలుస్తున్నది. ఆయన తిరిగి బీఆర్ఎస్‌లో చేరి వరంగల్ ఎంపీ స్థానం నుండి పోటీ చేస్తరన్న ప్రచారం జరుగుతున్నది. దీంతో లోక్‌సభ ఎన్నికల ముంగిట



ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాజకీ య సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. నిన్నటి వరకు బిఆర్ఎస్‌లో కీలక పాత్ర వహించిన వారందరూ కాంగ్రెస్, బీజేపిలలో చేరుతుండడంతో బిఆర్ఎస్ పూర్తిగా డీలా పడిపోతున్నది. బీఆర్ఎస్‌లో కీలక నాయకునిగా పేరు పొందిన మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన ఆయన కూతురు కడియం కావ్య కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయం తీసుకోవడం రాజకీయ వర్గాలలో సంచలనం రేపింది. వరంగల్ లోక్‌సభకు అభ్యర్థిగా పోటీపడిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌ను కాదని పార్టీ అధిష్టానం వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం కావ్యను ప్రకటించింది. దీంతో ఇప్పటికే వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌ను బీఆర్ఎస్‌ను వీడి బీజేపిలో చేరగా ఆయనే బీజేపి అభ్యర్థిగా ఎంపికయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలలో కీలక నేతగా, మేధావిగా ఉన్న మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి లాంటి ముఖ్య నేత పార్టీని వీడడం బఆర్ఎస్ శ్రేణులకు మింగుడుపడని అంశం గా మారింది. ఇప్పటికే పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు బీఆర్ఎస్ పార్టీని వీడడం, ప్రస్తుతం ముఖ్య నేతగా ఉన్న కడియం శ్రీహరి కూడా పార్టీని వీడుతుండడంతో బీఆర్ఎస్ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతున్నది. అనూహ్య మలుపులతో ఓరుగల్లు రాజకీయాలు ఒక్క సారిగా ఉత్కంఠగా మారాయి.

# తెలుసుకుందాం

## ఇది హోలోసిస్ యుగం



హిందూ మత విశ్వాసాల ప్రకారం ఇది కలియుగం. అయితే, సైన్స్ పరిశోధనల ద్వారా నిర్ధారించిన యుగాల్లో ఇది హోలోసిస్ యుగం. అంతకు ముందు ప్లీస్టోసీన్ యుగం నడిచింది. అది 2.588 మిలియన్ సంవత్సరాల క్రితం నుండి ఇప్పటికి 11,700 సంవత్సరాల క్రితం వరకు కొనసాగింది. ప్లీస్టోసీన్ కాలంలో ఆధునిక ఖండాలు ఇప్పటి మాదిరిగానే ఉండేవని శాస్త్రవేత్తలు ఒక నిర్ధారణకు వచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఒకదానికొకటి సాపేక్షంగా 100 కిలోమీటర్ల (62 మైళ్ళు) కంటే ఎక్కువ దూరం కదలి ఉండకపోవచ్చని వారి అభిప్రాయం. ఇక హోలోసిస్ యుగం 11,700 క్యాలెండర్ సంవత్సరాల నుంచి కొనసాగుతునే ఉంది. ఈ కాలంలో, ఖండాంతర కదలికలు కిలోమీటరు కంటే తక్కువే. ప్రస్తుత మంచుయుగం చివరి హిమనదీయ కాలం సుమారు 10,000 సంవత్సరాల క్రితం ముగిసింది. మంచు కరగడం వల్ల హోలోసీన్ ప్రారంభంలో ప్రపంచ సముద్ర మట్టాలు దాదాపు 35 మీటర్లు లేదా 115 అడుగులు పెరిగాయి. 40 డిగ్రీల ఉత్తర అక్షాంశం కంటే ఎక్కువగా ఉన్న అనేక ప్రాంతాలు ప్లీస్టోసీన్ హిమానీనదాల బరువుతో కుంగిపోయాయి. చివరి ప్లీస్టోసీన్, హోలోసిస్ కంటే 180 మీటర్లు (591 అడుగులు) వరకు పెరిగాయి. అవి ఇప్పటికీ పెరుగుతూనే ఉండడం విశేషం. కాగా, సముద్ర మట్టం పెరగడం వల్ల తరచు తీవ్ర ప్రాంతాల్లోకి సాగర జలాలు చొచ్చుకువస్తాయి. అయితే, తీర ప్రాంతాలను ముంచెత్తకుండా సముద్ర నీటిని, వాటిలోని శిలాజాలు అడ్డుకుంటాయి. చాలా సముద్రాల ఒడ్డున భారీ కొండలు, పర్వతాలను చూడవచ్చు. ఇక, హోలోసిస్ శిలాజాలు ప్రధానంగా లేక్బెడ్, వరద మైదానం, గుహ నిక్షేపాలలో కనిపిస్తాయి. తక్కువ అక్షాంశ తీరప్రాంతాల వద్ద హోలోసిన్ సముద్ర నిక్షేపాలు అరుదు. స్కాండినేవియాలో హిమనదీయ అనంతర రీబౌండ్ ఫలితంగా ఫిన్లాండ్‌తోసహా బాల్టిక్ సముద్రం చుట్టూ తీర ప్రాంతాలు ఆవిర్భవించాయి .

## గెలక్సీ అంటే..



గెలక్సీ అనే పదాన్ని తరచు వింటునే ఉంటాం. ఇంతకీ గెలక్సీ అంటే ఏమిటి? ఓ ఘనమైన గురుత్వాకర్షక వలయాన్ని గెలక్సీగా పేర్కోవచ్చు. ఇందులో కోటానుకోట్ల నక్షత్రాలు ఉంటాయి. అంతరిక్ష ధూళి, డార్క్ మేటర్ (చీకటి పదార్థం) కూడా ఉంటాయి. గ్రీకు భాషలోని 'గెలక్సియాస్' అనే పదం నుంచి గెలక్సీ అనే పదం వచ్చింది. 'పాలతో కూడిన' అని దీని అర్థం. సుమారు కోటి నక్షత్రాలతో కూడిన మరుగుజ్జు గెలక్సీల నుంచి వెయ్యి కోట్ల నక్షత్రాలను కలిగి ఉండే రాకాసి గెలక్సీల వరకూ ఇవి ఎన్నో రకాలు. ఈ నక్షత్రాలన్నీ ఓ అత్యధిక గరిమగల కేంద్రం చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటాయి. గెలక్సీలలో నక్షత్ర కుటుంబాలు, నక్షత్ర కూటమి, అంతర్ నక్షత్ర మేఘాలు కూడా ఉంటాయి. మన సూర్యుడు, పాలపుంత గేలక్సీలోని ఒక నక్షత్రం. మన సౌరమండలములో భూమి, ఇతర గ్రహాలు సూర్యుని చుట్టూ పరి భ్రమిస్తూ ఉంటాయి. కొన్ని గెలక్సీలు వర్తులాకారంలో ఉంటాయి. మరికొన్ని సర్పిలాకారంలో కనిపిస్తాయి. ఇక అనాకార గెలక్సీలు కూడా ఈ విశ్వంలో ఉన్నాయి. వీటిని ప్రత్యేక గెలక్సీలు అని కూడా అంటారు. వీటికి ప్రత్యేకమైన ఆకారమంటూ వుండదు. ఈ రకమైన గెలక్సీలలో'నక్షత్రాల పుట్టుక'కు ఆస్కారం ఎ క్కువ. గెలక్సీలు దాదాపు 1,000 నుండి 100,000 పార్సెక్‌ల వ్యాసంతో ఉంటాయి. ఒక్కో గెలక్సీ మధ్య కొన్ని మిలియన్ ఫార్సెక్‌ల దూరం ఉంటుంది. సాధారంగా గెలక్సీల 90 శాతం గరిమ చీకటి పదార్థంతో నిండి ఉంటుందని అంచనా. కొన్ని గెలక్సీల మధ్య కాలబిలం లేదా బ్లాక్ హోల్స్ ఉండవచ్చని శాస్త్రవేత్తలు ఊహిస్తున్నారు. వాస్తవాలు కనుకొనడానికి, సృష్టి రహస్యం ఛేదించడానికి ముమ్మర ప్రయత్నాలు, ప్రయోగాలు జరుగుతునే ఉన్నాయి.

## సూర్యుడి రంగు ఏమిటి?



తెల్లవారు ఝామున తిరిగి సంధ్యా సమయాన సూర్యబింబం అరుణ వర్ణాన్ని సంతరించుకుంటుంది. నిజానికి, ఏ సమయంలోనైనా సూర్య కిరణాలు దాదాపు తెల్లరంగులో ఉంటాయి. కానీ, భూమి తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుడి చుట్టూ తిరుగుతున్న క్రమంలో, ఒక చోటు ఉదయమైతే, మరో ప్రాంతంలో మధ్యాహ్నం కావచ్చు. ఇంకోచోట సాయంత్రం అయిదు వచ్చు. వేరొకచోట రాత్రి కూడా కావచ్చు. సూర్యుడు మారకపోయినా సమయాలు మారుతాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో సూర్యబింబం ఎరుపు లేదా నారింజ రంగులో కనిపించడానికి భూ వాతావరణమే ప్రధాన కారణం. ఉదయం, సాయంత్రం సమయాల్లో భూ వాతావరణంలో సూర్యకాంతి ఎక్కువ దూరం ప్రయాణించి మనల్ని చేరుతుంది. మధ్యాహ్న సమయంలో తక్కువ దూరమే ప్రసరిస్తుంది. భూమి, దాని వాతావరణం గోళాకృతిలో ఉండడమే ఇందుకు కారణం. సూర్యకాంతి ఎక్కువ దూరం ప్రయాణించినప్పుడు, సూర్య బింబం ఎరుపు లేదా నారింజ రంగులో కనిపిస్తుంది. అంతే తప్ప సూర్యుడిలో మార్పు ఉండదు. సైన్స్ భాషలో చెప్పాలంటే, కాంతి తరంగాలు పదార్థాలగుండా ప్రయాణించే క్రమంలో కొంత మేరకు పరిక్షేపణం (scattering) అవుతాయి. ఈ పరిక్షేపణం, తరంగ ధైర్ఘ్యం (wavelength) తక్కువగా ఉన్న ఊదా, నీలం, ఆకుపచ్చ రంగులకు ఎక్కువగాను, ఎక్కువగానున్న ఎరుపు, నారింజ రంగులకు తక్కువగా ఉంటుంది. అందువల్ల సౌరకాంతి వాతావరణం ప్రయాణిస్తున్న సందర్భంలో ఎరుపు, నారింజ రంగులు తక్కువే పరిక్షేపణం చెందడం వల్ల ఎక్కువ దూరం చేరలేవు. అవి మార్గమధ్యంలోనే పరిక్షేపణం బాగా చెంది మనల్ని చేరేలోగానే అంతరించిపోతాయి. ఈ ఘటన తక్కువ దూరమే ప్రయాణించే పరిస్థితి ఉన్నా మధ్యాహ్నం తటస్థపడదు. తెల్లని కాంతిగల సూర్యుడు ఉదయం, సాయంత్రం ఒకలాగా, మధ్యాహ్నం మరోలాగా కనిపించడానికి కారణం ఇదే. అయితే, భూ వాతారణం లేనిచోట నుంచి, ఉదాహరణకు చంద్రుడి పైనుంచి చూస్తే ఉదయం, మధ్యాహ్నం, సాయంకాల సమయాల్లో సూర్యుడు ఒకే విధంగా కనిపిస్తాడు.

సాధారణ ప్రదేశాల్లో కన్నా సముద్రం దగ్గర సూర్యుడు, చంద్రుడు ఎందుకు పెద్దగా కనిపిస్తారు? ఎందుకో తెలుసా? సూర్యోదయం, సూర్యాస్తమయం, చంద్రోదయం, చంద్రాస్తమయ సమయాల్లో సముద్ర ప్రాంతాల్లోనే కాకుండా.. భూమ్యాకాశాలు కలిసినట్లుగా కనిపించే చోట సూర్యుడు, చంద్రుడు పెద్దగా అగుపిస్తారు. మిట్టమధ్యాహ్నం కన్నా ఉదయం, సాయంత్రాల్లో సూర్యుడు పెద్దగా కనిపించడానికి మానవ దృష్టి భ్రమ (హ్యూమన్ ఆప్టికల్ ఇల్యూషన్) కారణమని పరిశోధనల్లో తేలింది. నిజానికి సూర్య, చంద్రుల పరిమాణాల్లో పెద్దగా తేడాలు ఉండవు. సముద్రతీరాల్లో, ఉదయం, సాయంత్రం వేళల్లో తీసిన..అలాగే వేరే ప్రాంతాల్లో, వేరే సమయాల్లో తీసిన చిత్రాల్లో సూర్య, చంద్రుల పరిమాణాలు దాదాపు ఒకేలా ఉంటాయి.

## విమానాలకు రివర్స్ గేర్ ఉంటుందా?



ఈ ప్రశ్నకు 'అవును', 'కాదు' అని రెండు రకాలుగానూ సమాధానం చెప్పవచ్చు. ఎందుకంటే, యుద్ధ విమానాల్లో రివర్స్ గేర్ విధానం ఉంటుంది. అవి ముందుకు, వెనక్కు, నిటారుగా పైకి, కిందకు, చివరికి తల్లకిందులుగానూ ప్రయాణించగలవు. హెలికాప్టర్లు కూడా ఎటువైపైనా వెళ్లగలదు. కానీ, సాధారణ విమానాలు మాత్రం వెనక్కు ప్రయాణించలేవు. రివర్స్‌లో వెళ్లలేకపోవడం వల్లే, ఒక్కోసారి ఉన్న చోటు నుంచి వెనక్కు వెళ్లాలంటే, ట్రాక్టర్ వంటి భారీయంత్రంతో లాగుతారు. విమానాల రెక్కలకు ఇంజన్లు బిగించి ఉంటాయి. అవి గాలిని పీల్చుకొని, దహన వాయువుల్ని అధిక పీడన వేగంతో వెనక్కు నెడతాయి. తత్ఫలితంగా విమానాలు ముందుకు వెళతాయి.

## అబద్ధపు ప్రచారం..



మగ నెమలి కన్నీళ్లు తాగితే, ఆడ నెమలి గుడ్లు పెడుతుందనే ఒక అబద్ధం బాగా ప్రచారంలో ఉంది. ఇలాంటి అపోహలు కొత్తేమీ కాదు. పాము పాలు తాగుతుందనుకోవటం, పాము నాగస్వరానికి నాట్యమాడుతుందని అనుకోవటం, పాములు పగపడతాయని అనుకోవడం ఇలాంటివే. అదే విధంగా, పిల్లి ఎదురొస్తే అనుకోని ఆపదలు కలుగుతాయన్నది కూడా కేవలం ఒక అపోహ మాత్రమే. నెమలికయినా, మరే జీవికయినా కన్నీటిలో జీవకణాలు ఉండవు. నెమలి, కోతి, కప్ప, పాము, మనిషి, ఆవులు, గేదెలు వంటి ద్విలింగ జీవులలో పునరుత్పత్తి తీరులో మార్పులు ఉండవు. విసనకర్రల్లాగా అందమైన ఈకలను విప్పారించేది మగ నెమలి. దాని కన్నీరును ఆడ నెమలి తాగదు. అలా తాగితేనే గుడ్లు పెడుతుందనటంలో నిజం లేనేలేదు.

## శీతాకాలంలో కీటకాలు..



సాధారణంగా వివిధ రకాల కీటకాలు శీతాకాలంలో ఎక్కువగా కనిపించవు. ఈగల్లాంటి కీటకాలెన్నో, ఇతర శీతల రక్త ప్రాణుల మాదిరిగానే చాలా వరకు తమ శరీర ధర్మాలను స్థిరంగా ఉంచుకోలేవు. వాతావరణంలో మార్పులతోపాటు, వాటితీరు కూడా మారుతుంది. వాతావరణంలోఉష్ణోగ్రతలు పడిపోయిన వెంటనే, కీటకాలు తమ శరీర ధర్మాలను సర్దుబాటు చేసుకునే ప్రయత్నంలో పడతాయి. ఎందుకంటే, ఆ సమయంలో వాటి జీవ సంబంధిత ధర్మాలు లేదా ముఖ్యమైన విధుల ప్రక్రియ శూన్య దశకు చేరుకుంటాయి. అందుకే, కీటకాలు చలికాలం వచ్చిన వెంటనే సురక్షిత ప్రదేశాలకు చేరుకుంటాయి. అక్కడ గుడ్లు లేదా లార్వా రూపంలో ఉండే తమ సంతాన్ని చలి బారి నుంచి కాపాడుకుంటాయి.

# నీతి తప్పిన రాజకీయాలు

ప్రజాపక్షం
31-03-2024, ఆదివారం

ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల తరుణంలో పలువురు నాయకులు పార్టీ కండువాలు మార్చుతున్న తీరు ఎవరికీ ఆశ్చర్యం కలిగించదు. ప్రజలు ఇటువంటి కప్పదాట్లకు అలవాటుపడిపోయారు. ప్రజలు పట్టించుకోరని అర్థమైనాక రాజకీయ నాయకులకు వెరపు, బెరుకు లేకుండా పోయింది. ఇది ఆకస్మిక పరిణామం కాదు. ఆర్థిక వ్యవస్థలో వచ్చిన క్రమానుగత మార్పులు, రాజకీయాలపై వాటి ప్రభావ ఫలితం. 90వ దశకంలో నయా ఉదార విధానాలు ప్రవేశించి సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పిజి) ప్రభుత్వ విధానంగా మారిపోయిందో రాజకీయ వ్యవస్థలోకి కార్పొరేట్ ధనశక్తి ప్రత్యక్ష ప్రవాహం పెరుగుతూ వచ్చింది. ప్రభుత్వ విధానాలను ఆ ధనశక్తి ఆదేశిస్తోంది, శాసిస్తోంది. జాతీయస్థాయిలో, రాష్ట్రాల స్థాయిలో ఏ రాజకీయ పార్టీ వారి ప్రయోజనాలను ఎక్కువగా కాపాడుతుందో ఆ పార్టీలకు ఎక్కువ మొత్తంలో ధనరాశులు అందుతున్నాయి. నీకిది–నాకిది అనే పద్ధతిలో వ్యవహారాలు నడుస్తున్నాయి. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తండ్రి రాజశేఖర్‌రరెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని 20 ఏళ్లక్రితమే ఈ క్విడ్ ప్రోకోను అమలు చేసిన దార్శనికుడు. ఎన్నికల బాండ్ల చట్టం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు కొట్టివేశాక, దాని ఆదేశంపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విధిలేని పరిస్థితుల్లో బాండ్ల విలువ, వాటిని అందుకుని నగదులోకి మార్చుకున్న పార్టీల వివరాలను ఎన్నికల కమిషన్‌కు వెల్లడించాక ఈ విషయం సామాన్యులకు సైతం సుబోధకమైంది. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతాపార్టీతో పాటు గనులు, మౌలిక వసతుల ప్రాజెక్టులు అమలు జరుగుతున్న రాష్ట్రాల్లోని పాలక పార్టీలకు భారీగా కార్పొరేట్ నిధులు అందటాన్ని మనం గమనించవచ్చు.

ఒకప్పుడు రాజకీయ విధానాలు ఆర్థిక వ్యవస్థను నిర్దేశించేవి. సరళీకరణ విధానాల తర్వాత ఆర్థిక విధానాలు రాజకీయాలను శాసిస్తున్నాయి. జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలన్నీ (కమ్యూనిస్టు పార్టీలు మినహా) వాటి జండా లు వేరైనా ఎజండా ఒక్కటే అయింది. నయా ఉదారవాద విధానాలు అమలు జరపటంలో పోటీ పడటమే ఆ ఎజండా. ఈ పరిస్థితుల్లో సిద్ధాంతం చచ్చింది, అవకాశవాదం హెచ్చింది. ఈ క్రమంలో ఓటర్లకు మితాయిల్లా ఉచిత పంపిణీలు, నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి డబ్బు చేరవేతలే అభివృద్ధికి అర్థంగా మార్చివేశాయి పాలకవర్గ పార్టీలు. జనాలు అవినీతి, అన్యాయాలు, అక్రమాలను ప్రతిఘటించే మనస్తత్వాన్ని క్రమంగా కోల్పోయి భ్రమలకు లోనవుతున్నారు. ఆ మాటున రాజకీయ – కార్పొరేట్ – కాంట్రాక్టు – మద్యం – రియల్ ఎస్టేట్ తరగతుల మధ్య బంధం బిగుసుకుంది. అధికార యంత్రాంగం కూడా వారితో కుమ్మక్కై ధనం పంట పండించుకుంటున్నది. ఎన్నికలు రాగానే ఈ ఆధునిక ధనాఢ్యులు, నడమంత్రపు సిరి రాయుళ్లు అన్ని రాజకీయ పార్టీలకు పుష్కలంగా ధనం, అవసరమైతే అభ్యర్థులను సరఫరా చేస్తున్నారు. గెలిచి అధికారం చేబట్టిన పార్టీ నుంచి వారు తమ ప్రయోజనాలుపెంపొందించుకుంటున్నారు. మధ్య దళారులను సంతృప్తి పరు స్తూ ప్రజలను భ్రమల్లో పెడుతున్నారు.

సిద్ధాంతం బాదరబందీ లేనప్పుడు రాజకీయ నాయకులకు ఏ పార్టీ అయినా ఒకటే. ఎన్నికల్లో విజయావకాశాలే పరమావధి. అందువల్ల ఒంటిమీద చొక్కా మార్చినంత సులభంగా రాజకీయరంగులు మార్చగలుగుతున్నారు.

ఎన్నికలముందే కాదు, గెలిచిన తర్వాతకూడా గెంతులు సర్వసాధారణమైనాయి. ప్రభుత్వం ఏర్పాటుకు కొన్ని సీట్లు తగ్గినపుడు పాలక రాజకీయ పార్టీయే ప్రత్యర్థి పార్టీ ఎమ్మెల్యేలను పార్టీలోకి 'ఆకర్షించి' ఓటర్ల తీర్పుకు విరుద్ధంగా అధికారం చేబడుతున్నది. కేరళలో ప్రభుత్వానికి ఒక్క ఓటు మెజారిటీయే ఉన్నప్పటికీ విజయవంతంగా ప్రభుత్వాన్ని నడిపిన అచ్యుతమీనన్ కాలం కాదిది. ప్రభుత్వానికి కొద్దిపాటి మెజారిటీ ఉన్నప్పుడు దాన్ని మైనారిటీలోకి మార్చే ప్రతిపక్ష యుక్తులను తట్టుకుని నిలిచేందుకు ప్రతిపక్ష ఎంఎల్‌ఎలను కొనివేయటం మరో ఎత్తుగడ.

సంకీర్ణ ప్రభుత్వంలోని భాగస్వామ్య పార్టీలను చీల్చి అధికార అందలమెక్కటం లేదా భాగస్వామికావటం మరో ఎత్తుగడ. వీటన్నిట్లో ఆరితేరింది బిజెపి – కేంద్రం లో అధికారం, పుష్కలంగా డబ్బు ఉండటం వల్లే అది అందులో సఫలమవుతున్నది. అవసరానికి మించిన సంఖ్యాబలమున్నా ప్రతిపక్షం లేకుండా చేసిన టిఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల వారిది మరో ప్రత్యేక రస్తా. ఇప్పుడు ముఖ్యనేతలు పలువురు ఆ పార్టీకి వీడ్కోలు పలుకుతున్నా గొంతులో వెలక్కాయ ఇరుక్కున చందాన నోరెత్తి ఖండించలేని దురవస్థ ఆయనది. సిద్ధాంతబలం, నిబద్ధతగల రాజకీయాలే నీతినియమాలను నిలబెట్టగలవు. ప్రజల మనోగతంలో మార్పు ప్రాథమికావసరం.

# బిఆర్‌ఎస్‌కు విషమపరీక్ష

రాజధాని సందడి
– బొమ్మగాని కిరణ్‌కుమార్

మరో నెల రోజుల్లో 23 సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్న బిఆర్‌ఎస్(టిఆర్‌ఎస్) పార్టీ అత్యంత విషమ పరీక్షను ఎదుర్కొంటున్నది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు వెలువడిన తరువాత ఒక్కొక్కరుగా ఎంఎల్‌ఎలు, సీనియర్ నాయకులు గులాబీ పార్టీకి గుడ్ బై చెబుతున్నారు. ఐదుగురు సిట్టింగ్ ఎంపిలు పార్టీని వీడగా, ఏకంగా ఎంపి అభ్యర్థులుగా ప్రకటించబడిన వారే మాకు టిక్కెటొద్దు అంటూ గడప దాటేస్తున్నారు. ఆ పార్టీ కీలక నాయకుడు, సెక్రెటరీ జనరల్, పార్లమెంటరీ పార్టీ నేత డాక్టర్ కె.కేశవరావు సైతం తిరిగి కాంగ్రెస్‌కు వెళ్ళిపోతానని ప్రకటించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, వరంగల్ అభ్యర్థిగా ప్రకటించబడిన ఆయన కుమార్తె కావ్య కూడా కాంగ్రెస్‌లో చేరుతున్నారు. సిట్టింగ్ ఎంఎల్‌ఎ దానం నాగేందర్‌ను కాంగ్రెస్ పార్టీ సికిందరాబాద్ అభ్యర్థిగా ప్రకటించింది. అనేకమంది బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు అధికార పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారని, ఆ లెక్క 30 వరకు ఉండబోతుందని కాంగ్రెస్ నాయకులే చెబుతున్నారు. ఇన్ని కప్పదాట్లు జరుగుతున్నప్పటికీ తెలంగాణ సమాజం ఈ పరిణామాలను పెద్ద ఆశ్చర్యంగా ఏమీ చూడకపోగా, ఇది జరుగుతుందని ముందే ఊహించినట్లుంది. ఎందుకంటే పదేళ్ళ క్రితమే టిఆర్‌ఎస్ ఈ ప్రక్రియకు తెరలేపింది. మొదట టిడిపి ఎంఎల్‌ఎ తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మంత్రివర్గంలోకి తీసుకున్నప్పుడు తెలంగాణ సమాజం ఉలిక్కిపడింది. ఆ తరువాత రాజకీయ పునరేకీకరణ పేరుతో బిఎస్‌పి, టిడిపి, ప్రతిపక్ష కాంగ్రెస్‌లోని మెజారిటీ సభ్యులను టిఆర్‌ఎస్ తనలో కలిపేసుకుంది. ఇతర పార్టీల ఎంఎల్‌సిలు కూడా అదే బాట పట్టారు. ఐదేళ్ల క్రితం టిఆర్‌ఎస్ రెండవసారి అధికారంలోకి వచ్చినప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సభ్యులను తన వైపునకు తీసుకొని ఏకంగా ఆ పార్టీకి శాసనసభలో ప్రతిపక్ష హోదానే కాదు, గుర్తింపు కూడా లేకుండా చేసింది టిఆర్‌ఎస్. ఇది కిందిస్థాయిలో స్థానిక సంస్థల వరకు పాకింది. దీంతో ఎంఎల్‌ఎలు, ఎంపిలు పార్టీలు మారడం తెలంగాణ ప్రజలకు అలవాటుగా మారిపోయింది. మొదట్లో టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం, గతంలో తాము బాధితులుగా ఉన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని అనేకమంది ఎంఎల్‌ఎలు టచ్‌లోకి వచ్చినా మొదట్లో ఫిరాయింపులను ప్రోత్సహించదలుచుకున్నట్లు కనిపించలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వారం రోజులకే ఈ ప్రభుత్వం ఆరునెలల్లో కూలిపోతుందని బిఆర్‌ఎస్ నాయకులు నిష్ఠూరాలాడారు. బిజెపి నేతలు కూడా పార్లమెంటు ఎన్నికల తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని జోస్యాలు చెబుతున్నారు కూడా. హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రాజ్యసభ ఎన్నికలను ఆయుధంగా మలుచుకుని అరడజను కాంగ్రెస్ ఎంఎల్‌ఎలను క్రాస్ ఓటింగ్‌కు ఆకర్షించిన తీరు, తదితర వార్తలు రాష్ట్ర కాంగ్రెస్‌ను పునరాలోచనలో పడేసినట్లు పరిశీలకులు భావిస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల తరువాత ఒకవేళ బిజెపి గనుక మూడోసారి అధికారంలోకి వస్తే.. తెలంగాణలో మిత్రపక్షమైన సిపిఐతో కలిపి సాధారణ మెజారిటీకి ఐదు స్థానాలే అధికంగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ముందు జాగ్రత్తకు సిద్ధమైంది. పార్లమెంటు ఎన్నికల తరువాత చూసుకుందామనుకున్నప్పటికీ, రాజకీయ అనివార్యత కారణంగా ముందుగానే ఇతర పార్టీల ఎంఎల్‌ఎలు, ఎంపిలు, నాయకులకు గేట్లు ఎత్తేసినట్లు కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇదే మాట స్వయంగా పిసిసి అధ్యక్షుడు కూడా అయిన సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

### ఉద్యమ బలంతో సంక్షోభాలను దాటింది

వేగంగా మారిన రాజకీయ పరిణామాలతో బిఆర్‌ఎస్ ఎంపిలు, ఎంఎల్‌ఎలు, నాయకులు హస్తం పార్టీ వైపు క్యూ కదుతున్నారు. మరికొందరు బిజెపి వైపు కూడా చూస్తున్నారనే వార్తలు బిఆర్‌ఎస్‌ను ఆందోళనకు గురి చేస్తున్నాయి. మూడు నెలల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌కు మధ్య రెండు శాతం ఓట్లే తేడా. నెలన్నర క్రితం కూడా పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో త్రిముఖ పోటీ ఉంటుందని, ఎక్కువ స్థానాలలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ మధ్య పోటీ ఉంటుందని పరిశీలకులు భావించారు. కాని అకస్మాత్తుగా పరిస్థితులు మారిపోయాయి. వరుసగా నాయకులు, అభ్యర్థులు పార్టీ వీడుతుండడం బిఆర్‌ఎస్‌ను కలవరపెడుతున్నది. దీనికి కేవలం బిఆర్‌ఎస్ అగ్రనాయకత్వ వైఖరే కారణమనేది సర్వవిదితం. టిఆర్‌ఎస్ గతంలో అనేక సంక్షోభాలు, విషమ పరీక్షలు ఎదుర్కొన్నప్పటికీ, తెలంగాణ ఉద్యమ బలంతో నెగ్గుకు రాగలిగింది. పార్టీ ఏర్పడిన తొలినాళ్ళలో హైదరాబాద్ మేయర్ స్థానానికి జరిగిన ఎన్నికల్లో టిఆర్‌ఎస్ ప్రకటించిన అభ్యర్థి చివరి నిమిషంలో ఎవరికీ చెప్పకుండా నామినేషన్ ఉపసంహరించుకొని వెళ్ళిపోయాడు. అలాంటి సమయంలో ఆపద్బాంధవుడులాగా నాయిని నర్సింహారెడ్డి బరిలో దిగి పార్టీ పరువు దక్కించారు. ఆ తరువాత కూడా పదిమందికి పైగా టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు కాంగ్రెస్ వైపు వెళ్ళినా కూడా ఉద్యమ బలంతో పార్టీ నిలబడగలిగింది. ఒకసారి అనేకమంది సీనియర్ పార్టీ నాయకులు కెసిఆర్‌ను దుమ్మెత్తిపోసి పార్టీని వీడడంతో ఆయన రాజీనామాకు సిద్ధపడగా, వారించడంతో కొనసాగారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు జరిగిన జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా వెనుకంజ వేసి, అసలు టిఆర్‌ఎస్ ఎన్నికల బరిలో ఉండబోదని కెసిఆర్ ప్రకటించారు. చివరకు 16 ఎఫ్ నిబంధనపై ఉద్యమం, కెసిఆర్ ఆమరణ నిరాహార దీక్షతో టిఆర్‌ఎస్ పునరుజ్జీవం పొందింది. ఇలా అనేకమార్లు టిఆర్‌ఎస్ విషమ పరీక్షలను ఓపిగ్గా ఎదుర్కొని నిలదొక్కుకోగలిగింది.

### కాల పరీక్షలో నిలిచేనా?

ఉద్యమ పార్టీ కాస్త 2014లో అధికారంలోకి వచ్చాక ఫక్తు రాజకీయ పార్టీగా మారుతున్నట్లు స్వయంగా కెసిఆర్ ప్రకటించిన తరువాతే ఆ పార్టీ అడుగులు దాన్ని వేగంగా జనం నుండి దూరం చేశాయి. ఉద్యమంలో అండగా నిలిచిన నాయకులను, ఉద్యమకారులను, రాజకీయ పార్టీలను కెసిఆర్ దూరం పెట్టారు. తమ పార్టీ ఓడిపోయిన చోట, ఇతర పార్టీ నుండి గెలిచిన ఎంఎల్‌ఎలను చేర్చుకొని, అధికారం, వ్యక్తుల కేంద్రంగా ప్రభుత్వాన్ని నడిపారు. చివరకు పార్టీని సైతం నిర్మాణం లేకుండా బిఎస్‌పి తరహాలో ఎంఎల్‌ఎలకే గుత్తాధిపత్యం ఇచ్చి, వారినే నియోజకవర్గ అధ్యక్షులుగా చేశారు. జిల్లా కమిటీలను నామమాత్రం చేయడంతో కార్యకర్తలకు నాయకత్వానికి అనుసంధానం లేకుండా పోయింది. ధర్నా చౌక్‌ను ఎత్తివేయడం, ప్రజా ఉద్యమాలను అణిచివేయడం, ఎవరిని కలవకుండా అప్రజాస్వామికంగా వ్యవహరించడం ప్రజల నుండి ఆ పార్టీని దూరం చేసింది

. టిఆర్‌ఎస్ ఏర్పాటైన కొత్తలో కెసిఆర్ తన ఎంఎల్‌ఎ పదవికి రాజీనామా చేసి టిఆర్‌ఎస్ తరుపున బస్సు గుర్తుతో పోటీ చేస్తే ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఆ తరువాత వంద రోజుల్లోనే జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నాగలి పట్టిన రైతు గుర్తుతో టిఆర్‌ఎస్ పోటీచేస్తే రెండు జిల్లా పరిషత్ చైర్మన్ పదవులు, వంద ఎంపిపి అధ్యక్ష పదవులను తెలంగాణ ప్రజలు కట్టబెట్టారు. చివరకు కారు గుర్తును ఖరారు చేసిన తరువాత రెండుసార్లు అధికారంలోకి తీసుకువచ్చారు. మూడు రకాల ఎన్నికల గుర్తులపై పోటీ చేసినప్పటికీ ఉద్యమ బలంతో టిఆర్‌ఎస్ ముందుకు సాగింది. కాని తెలంగాణ ఉద్యమాన్నే ఎజెండాగా ఏర్పాటు చేసిన టిఆర్‌ఎస్ నుండి తెలంగాణ పేరును లేకుండా చేసి బిఆర్‌ఎస్‌గా మార్చడంతో ఆ పార్టీకి ఆత్మను తొలగించినట్లయింది.

పదేళ్ళ పాటు కేవలం అధికారం కేంద్ర బిందువుగా రాజకీయాలు నడపడంతో, ఆ పార్టీలో ఉన్నవారికి, కొత్తగా ఇతర పార్టీల నుండి చేరిన వారికి పదవి, అధికారమే పరమవధిగా మారాయే తప్ప, సిద్ధాంతం, నిర్మాణం అంటే నిషిద్ధ పదాలు అయ్యాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తరువాత కూడా ఓటమికి కారణాలను అన్వేషించి, తప్పులను సరిదిద్దుకోకుండా వ్యవహరిస్తున్న తీరును స్వంత పార్టీ నేతలే ప్రైవేటు గా తప్పుబడుతున్నారు. ఇదే మాటను స్వయంగా కేశవరావు కూడా పార్టీని వీడుతున్న సమయంలో చెప్పారు. కొందరు నాయకులు వెళ్ళిపోయినా సిద్ధాంత పటిమ, పార్టీ నిర్మాణం ఉంటే నిలదొక్కుకునే పరిస్థితి ఉండేది. ఆ రెండు లేకపోవడంతో బిఆర్‌ఎస్‌లోని పరిణామాలను ప్రజలు ఆసక్తితో గమనిస్తున్నారు.

# ప్రజాబంధు బద్దం ఎల్లారెడ్డికి లాల్ సలాం

తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రముఖమైన పాత్ర పోషించిన కామ్రేడ్ బద్దం ఎల్లారెడ్డి 1906లో ఒక సాధారణ రైతు కుటుంబంలో గాలిపల్లిలో శ్రీ హనుమంతరెడ్డి లక్ష్మమ్మలకు జన్మించారు. విద్యార్థి దశలోనే చాలా చురుకైన పాత్ర పోషించి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. కాకినాడ ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని ఏడు నెలల జైలు శిక్ష కూడా అనుభవించారు. ఆంధ్ర మహాసభలలో ప్రముఖ నాయకునిగా రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. తర్వాత కమ్యూనిస్టు, సోషలిస్ట్ భావాల ప్రభావంతో నిజాం రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. పార్టీలో అగ్రనాయకునిగా రావి నారాయణరెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్‌తో బద్దం ఎల్లారెడ్డి పని చేశారు.

ప్రజా సమస్యల మీద నిజాంకు, భూస్వాముల అధికారానికి, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాట దళాన్ని ఏర్పాటు చేసి గ్రామ ప్రజలను కార్యకర్తలుగా తయారుచేసారు. పెద్దఎత్తున తెలంగాణ ప్రాంతంలో రైతాంగ సాయుధ పోరాటానికి పైవారితోపాటు 11, సెప్టెంబర్ 1947 లో పిలుపునిచ్చారు. బద్దం ఎల్లారెడ్డి గారి దళం సభ్యులు అనభేరి ప్రభాకర్ రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి, 10 మంది దళ సభ్యులు రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసి కరీంనగర్ జిల్లా మహమ్మదాపూర్ గుట్టలలో జరిగిన పోరాటంలో అమరులైనారు. ఆ ఇద్దరినీ కోల్పోవడం బద్దం గారికి, కరీంనగర్ జిల్లాకి తీరని లోటుగా మిగిలిపోయింది. పోరాటంలో భాగంగా బద్దం గారు మూడు సంవత్సరాల కఠినమైన కారాగార శిక్షను అనుభవించారు. జైలులో ఉండగానే 1952లో కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం నుండి జరిగిన మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికలలో పార్లమెంటు సభ్యునిగా ఎన్నికైనారు,1958లో బుగ్గారం నియోజకవర్గం నుండి శాసనసభ సభ్యునిగా, 1965 లో రాజ్యసభ సభ్యునిగా, 1972లో ఇందుర్తి నియోజకవర్గం నుండి శాసనసభ సభ్యునిగా ఎన్నికైనారు. 1978 లో శాసనసభ కమిటీ



SRI BADDAM YELLA REDDY (1906 - 1978)

సభ్యునిగా విశాఖపట్నం గిరిజనుల సమస్యల ను తెలుసుకోవడానికి వెళ్లి అక్కడ అనారోగ్యానికి గురై రెండు నెలల తర్వాత గాలిపల్లిలో 27 డిసెంబర్ 1978లో మరణించారు. చాలా సామాన్యమైన జీవితం గడుపుతూ నిరంతరం ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ తన భూమిని పేదలకు ఉచితంగా పంచడం జరిగింది. సిరిసిల్లలోని మగ్గం కార్మికులకు అందించిన సేవలకు గుర్తుగా సిరిసిల్లలో బద్దం ఎల్లారెడ్డి నగర్ అని ఒక కాలనీకి ఆయన పేరును ప్రేమతో పెట్టుకోవడం జరిగింది. అది బి వై నగర్ గా సిరిసిల్లలో పిలువబడుతుంది. కరీంనగర్ లోని సిపిఐ పార్టీ భవన్ పేరును బద్దం ఎల్లారెడ్డి భవన్ గా మార్చబడింది. 2006లో కరీంనగర్ లో ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించడం జరిగింది. 2015లో బద్దం ఎల్లారెడ్డి గారి కుమారుడు రామ్‌రెడ్డి గాలిపల్లిలో విగ్రహ ప్రతిష్టాపన చేయడం జరిగింది. ప్రజలకు చేసిన సేవకు గుర్తింపుగా ప్రజలు ప్రేమతో 'ప్రజాబంధు' బద్దం ఎల్లారెడ్డి గారు అని పిలుచుకుంటారు. ఈయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం.

బద్దం ఎల్లారెడ్డి మీద కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఆకునూరు గ్రామానికి చెందిన ఈదులకంటి ఈశ్వర్ రెడ్డి రాధాదేవి గార్ల కుమార్తె శ్రీమతి ఈదులకంటి అనిత కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం నుండి ప్రొఫెసర్ పి. సదానందం గారి గైడెన్స్‌లో 'ద రోల్ ఆఫ్ బద్దం ఎల్లారెడ్డి ఇన్ లెఫ్ట్ మూమెంట్ ఇన్ తెలంగాణ – ఏ స్టడీ' అనే అంశంపై పరిశోధన పూర్తిచేసి డాక్టరేటు పొందారు. మారుమూల గ్రామానికి చెందిన అగ్ర నాయకుడు బద్దం ఎల్లారెడ్డి గారిపై పరిశోధన పూర్తి చేయడం గర్వకారణంగా ఉందని డాక్టర్ అనిత ఆనందం వ్యక్తం చేశారు. డాక్టర్ ఈదులకంటి అనితకు బద్దం ఎల్లారెడ్డి గారి కుమారులు కోడళ్ళు డాక్టర్ రామ్ రెడ్డి డాక్టర్ సునీత గారు, లక్ష్మారెడ్డి సవిత గారు, మనుమలు, మనమరాలు, గ్రామ సర్పంచ్, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.



**డాక్టరేట్ చేసిన ఈదులకంటి అనిత**

బద్దం ఎల్లారెడ్డి మీద కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఆకునూరు గ్రామానికి చెందిన ఈదులకంటి ఈశ్వర్ రెడ్డి రాధాదేవి గార్ల కుమార్తె శ్రీమతి ఈదులకంటి అనిత కాకతీయ విశ్వవిద్యాల యం చరిత్ర విభాగం నుండి ప్రొఫెసర్ పి సదానందం గారి గైడెన్స్ లో 'ద రోల్ ఆఫ్ బద్దం ఎల్లారెడ్డి ఇన్ లెఫ్ట్ మూమెంట్ ఇన్ తెలంగాణ ఏ స్టడీ' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి డాక్టరేటు లభించినందుకు మారుమూల గ్రామానికి చెందిన అగ్ర నాయకుడు బద్దం ఎల్లారెడ్డి గారిపై పరిశోధన పరిశోధన పూర్తి చేయడం గర్వకారణంగా ఉందని డాక్టర్ అనిత ఆనందం వ్యక్తం చేశారు. డాక్టర్ ఈదులకంటి అనితను బద్దం ఎల్లారెడ్డి గారి కుమారులు కోడళ్ళు డాక్టర్ రామ్ రెడ్డి డాక్టర్ సునీత గారు, లక్ష్మారెడ్డి సవిత గారు, మనుమలు, మనమరాలు గ్రామ సర్పంచ్ గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

## ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన పంటలు

### కెవికె శాస్త్రవేత్త, ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జి డాక్టర్ రవి కుమార్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన పంటలు పండుతాయని రైతులు ఉపయోగించుకోవాలని కెవికె శాస్త్రవేత్త, ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జి డాక్టర్ రవి కుమార్ తెలిపారు. శనివారం హావేలి ఘనపూర్ మండలం ఫరీద్ పూర్ గ్రామంలో డాక్టర్ డి.రామానాయుడు ఏకలవ్య ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కెవికె శాస్త్రవేత్త, ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జి డాక్టర్ రవి కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఎలాంటి ఖర్చు లేకుండా సహజ సిద్ధంగా పంటలు సాగు చేయవచ్చు అన్నారు. పంటలకు హాని కలిగించే రసాయనాలు పురుగుమందుల అవశేషాలు లేని నాణ్యమైన ఆహార పంటలు పండుతాయన్నారు. వరితో పాటు కూరగాయలు, పప్పు ధాన్యాలు, నూనె గింజల తదితర పంటలు పండించవచ్చని పేర్కొన్నారు. మార్కెట్‌లో సేంద్రీయ పంటలకు అత్యధిక ధరలు లభిస్తున్నాయని సూచించారు. అనంతరం రైతులకు క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయానికి కావలసిన ఎరువులు, చీడపీడల నివారణకు పాటించవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో కెవికె హెడ్ దత్తాత్రేయ నల్కర్, మండల వ్యవసాయ అధికారి నాగ మాధురి, ఎఇఒ భార్గవ్ గౌడ్, సిఇఒ అమీర్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధి పనుల్లో అవినీతి



**ప్రజాపక్షం/కొమురవెల్లి :** కొమురవెల్లి మల్లన్న ఆలయం వద్ద గత పాలక మండలి ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులలో భారీ అవినీతి జరిగిందని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి ఆరోపించారు.శనివారం పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కిష్టారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకమండలి ఆధ్వర్యంలో చేపట్టిన 55గదులు, క్యూకాంప్లెక్స్, దాసారం గుట్టపైకి వేసిన రోడ్డు పనుల్లో భారీ అవినీతి జరిగిందని కాంట్రాక్టర్ నుండి ఆలయ మాజీచైర్మన్‌కు భారీ ముడుపులు ముట్టాయని ఆరోపించారు. పనుల కాంట్రాక్టులకు సంబంధించిన ఫైళ్ల పై ఆలయ ఇఒకు సంతకం చేసే అథారిటీ ఉంటుందని, కానీ అందుకు భిన్నంగా మాజీ ఎంఎల్‌ఎ ముత్తిరెడ్డి అండదండలతో మాజీ చైర్మన్ ఆ ఫైళ్లపై సంతకాలు చేయాలని ఫైళ్లను తన దగ్గర పెట్టుకొని కాంట్రాక్టర్ నుంచి డబ్బులు వసూలు చేశాడన్నారు. భక్తులు హుండీల్లో వేసిన కానుకల డిపాజిట్లను అభివృద్ధి పేరుతో విడిపించి గత పాలక మండలి కోట్ల రూపాయలు వృధా చేసిందని మండిపడ్డారు. ఆలయ భూముల నుండి మట్టి తవ్వి దాసారం గుట్టకు పోసి 4.5 కోట్లు మల్లన్న సొమ్ములు పట్ట పగలు కొట్టేసారన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ చైర్మన్ చేసిన అవినీతి అక్రమాలను, ప్రస్తుత చైర్మన్ పట్టించుకోకపోవడంపై ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.గత పాలకమండలి చేపట్టిన అన్ని అభివృద్ధి పనులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు తాజామాజీ సర్పంచ్ తాడురి రవీందర్, మండల నాయకులు తేలు ఇస్తారి, తాడురి మల్లేశం, నిల బిక్షపతి, చింతల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## యువత నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

### జిల్లా అడిషనల్ కలెక్టర్ జ్యోతి



**ప్రజాపక్షం / నర్సంపేట :** యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, సమస్యల పట్ల ప్రశించే తత్వాన్ని అలవర్చుకోవాలని వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. స్థానిక జయముఖి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో శనివారం నెహ్రూ యువ కేంద్ర, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమనికి అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గోన్ని మాట్లాడుతూ దేశ నాయకులను స్ఫూర్తిగా తీసుకొని సమాజాహివృద్ధికి తోడుపాటును అందించాలని పిలుపునిచ్చారు. జాతీయ సాంకేతిక శిక్షణ కళాశాల ప్రోఫెసర్ ఆనంద్ కిషోర్ మాట్లాడుతూ మనిషి అజ్ఞానం నుండి విజ్ఞానం వైపునకు, విజ్ఞానం నుండి శాస్త్ర సాంకేతిక రంగాల వైపు పరిగెడుతున్న క్రమంలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకొని, నూతన అవిష్కరణలకు యువత ముందుకు రావాలని పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎం. భగవాన్ రెడ్డి, వరంగల్ డిఎస్‌సిడిఒ నోబల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ జానకి, నర్సంపేట ఆర్‌డిఒ కృష్ణవేణి, ఆకులపల్లి మధు, వెల్దండి సురేష్, గాలి బిక్షపతి, రాజేందర్ తదితరులు పాల్గోన్నారు.

## సెకండ్ ఇన్నింగ్స్ సుఖంగా సాగిపోవాలి

### జిల్లా ఎస్‌పి కిరణ్ ఖరే



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** పదవి విరమణ అనేది ప్రతి ఉద్యోగికి తప్పదని జిల్లా ఎస్‌పి కిరణ్ ఖరే అన్నారు. పదవీ విరమణ పొందిన ఎఆర్ హెడ్ కానిస్టేబుళ్లు నారాయణ రెడ్డి, వెంకటయ్య, గోపాల్ రెడ్డిలను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు పలికి, వారిని ఘనంగా సన్మానించి, వారి కుటుంసభ్యులకు గృహోపకరణాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ, పదవి విరమణ చేసిన ఉద్యోగులు కుటుంబం, బంధు మిత్రులతో కలిసి సుఖ సంతోషాలతో గడపటానికి రెండో ఇన్నింగ్స్ అవకాశంగా భావించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ, దాదాపు 38 ఏళ్లుగా విధి నిర్వహణలో అహర్నిశలు శ్రమించి, ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. ప్రతి ఉద్యోగికి పదవి విరమణ అనివార్యమని, రిటైర్మెంట్ తర్వాత వచ్చే డబ్బులను ప్రణాళిక బద్దంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఏ అవసరం వచ్చినా పోలీస్ శాఖ తరపున తమవంతు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ఏఆర్ అడిషనల్ ఎస్‌పి వేముల శ్రీనివాస్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు నగేష్, శ్రీకాంత్, కిరణ్, జిల్లా పోలీసు అధికారుల సంఘం నేత మర్కాల యాదిరెడ్డి, పదవీ విరమణ చేసిన హెడ్ కానిస్టేబుళ్ళ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** ధాన్యం కొనుగోలులో రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎంతటివారైనా చర్య లు తప్పవని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శనివారం మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వస్తున్న వరిధాన్యాన్ని ఎప్పటికప్పుడు కాంటాలు పెట్టి వేగవంతంగా సేకరణ జరుపాలని అధికారులకు ఆదేశించారు. యాసంగి సీజన్‌లో వరి ధాన్యాన్ని పూర్తి స్థాయిలో గింజ లేకుం డా రైతుల వద్ద నుండి ధాన్యం సేకరణ పూర్తి చేయ డం జరుగుతుందన్నారు. గ్రామాల వారీగా కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లుల కేటాయింపు జరిగిందని తేమ శాతం చూసుకొని రైతులకు ఇబ్బందులు కలగకుండా వేగవంతంగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డిఎస్ఒ రోజారాణి, డిసిఒ రాజేందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్, తహసీల్దార్ విశాలాక్షి, ఎంపిడిఒ రఘురామకృష్ణ, పిఎసిఎస్ సిఇఒ కాశెట్టి బాలస్వామి, పంచాయితి కార్యదర్శి సౌజన్యం, క్షేత్ర స్థాయి ఎఇఒ అజయ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

### రెవెన్యూ రికార్డులు పరిశీలించిన కలెక్టర్

అనంతరం మండల రెవెన్యూ కార్యాలయాన్ని జి ల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకస్మిక తనిఖీ చేశా రు. మండలానికి చెందిన ధరణి పెండింగ్ ఆన్‌లైన్ దరఖాస్తులను ఏ మేరకు విచారణ జరిపారని దరఖాస్తుల పరిశీలన చేశారు. దరఖాస్తుల క్షేత్రస్థాయి విచారణ పనులు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. ని ర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులు బాధ్యులవుతారని హెచ్చరించారు. కలెక్టర్ వెంట తహశిల్దార్ విశాలాక్షి, సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## కబ్జా కోరల్లో కోడి పుంజుల అంగడి

### తెరవెనుక చక్రం తిపుతున్న నాయకులు



**ప్రజాపక్షం/ఏటూరునాగారం :** ఏటూరునాగారం ఏజెన్సీ గ్రామీణ ప్రాంతంలో భూములకు డిమాండ్ పెరగడంతో కొంతమంది వ్యక్తులు మాఫియాగా ఏర్పడి ప్రభుత్వ చెరువు శిఖం భూములు రోడ్డును సైతం వదిలిపెట్టకుండా యదేచ్చగా కబ్జాలకు పాల్పడుతున్నారు. మండల కేంద్రంలోని నేషనల్ హైవేకు ఆనుకొని ఉన్న మానసపల్లి శివారు సర్వే నెంబర్ 12లో 40 ఎకరాల భూమిని భూమాఫియా నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి. భూమి తమదంటూ తమకు రెవెన్యూ పట్టాలు ఉన్నాయంటూ ఇట్టి భూమిని గత కొన్ని రోజుల క్రితం దున్నించడం జరిగింది. రెవెన్యూ అధికారుల అండదండలతోనే అక్రమ పట్టాలు పొంది కోడి పుంజుల అంగడి స్థలాన్ని ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 1986 సంవత్సరంలో ఇంటి స్థలాల కోసం ప్రజలు ఇట్టి భూమిని పోడు చేసుకుని గత కొన్నిసార్లు గుడిసెలు వేసుకున్న సందర్భాలు నెలకొన్నాయి. ఈ భూమి తమది అంటే తమదంటూ ఇటు రెవెన్యూ అధికారులు. అటు అటు విశాఖ అధికారుల మధ్య వివాదాలు తలెత్తాయి. ప్రజలకు మాత్రం ఇంటి స్థలాలు కల కలగానే మిగిలిపోయింది. గతంలో ఇక్కడ నివాసాలు ఉండడం ద్వారానే ఇట్టి కోడిపుంజులు అంగడి ప్రాంతంలో భారీ చింత చెట్టు వృక్షాలు నేటికీ సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. జాతీయ రహదారికి అనుకొని ఇట్టి స్థలం ఉండడంతో గత కొన్ని ఏళ్లుగా భూ కబ్జాదారులు ఇట్టి స్థలంపై కన్నేసి ఆక్రమించే ప్రయత్నం చేశారు. పక్క మంగపేట మండలానికి చెందిన కొంతమంది నాయకులు. ఇక్కడ కొంతమంది స్థానిక నాయకుల సహకారం అండదండలతో అక్రమ పట్టాలు పొందారు అనే జోరుగా ప్రచారం జరుగుతుంది. అధికారులు సైతం భూ కబ్జాలను అరికట్టకుండా కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం. జిల్లా అధికార యంత్రాంగం ఇట్టి భూకబ్జాలపై దృష్టి సారించి భూకబ్జాలను నియంత్రించి భూకబ్జాదారులపై కేసులు నమోదు చేయాలని, భూమిలేని నిరుపేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## అవకాశవాదులను గుర్తించండి

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** బిఆర్ఎస్ పార్టీని వదిలేవారంతా వారి సొంత లాభాల కోసం మాత్రమే వెళ్తున్నారని అలాంటి అవకాశవాదులను గుర్తించాలని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, నర్సంపేట మాజీ ఎంఎల్‌ఎ పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. వరంగల్ జి ల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడు తూ వర్ధన్నపేట నియోజకవర్గం ప్రజలతో నాకు విడదీయరాని బంధం ఉందని అన్నారు. నాపై నమ్మకంతో మీరం తా కలిసిమెలిసి ధైర్యంగా ఉండాలని చెప్పారు. బిఆర్ఎస్ పార్టీని వదిలేవారంతా వారి సొంత లాభాల కోసం మాత్ర మే వెళ్తున్నారని, అవసరమైతే కొత్త నాయకులను తయా రు చేసుకుందామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏదో విధం గా కేసులు పెట్టి మన నాయకులను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అవన్నీ తిప్పికొట్టే ప్రయత్నం చేసి మనం గట్టిగా నిలబడుదామన్నారు. పార్లమెంట్ ఎ న్నికల్లో మన పార్టీ ప్రకటించిన అభ్యర్థికి పూర్తి మద్దతుగా ఉంటూ గెలుపే లక్ష్యంగా పని చేద్దామన్నారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ అభ్యర్థి మధుకు మైనంపల్లి మద్దతు



**ప్రజాపక్షం / సంగారెడ్డి ప్రతినిధి :** మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎంపికైన నీలం మధు ముదిరాజ్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ ఎంఎల్‌ఎ మైనం పల్లి హన్మంతరావును కలిశారు. ఎంపి అభ్యర్థిగా తన ఎంపికలో సహకారించినందుకు ధన్యవాదాలు తెలిపారు. తనకి సంపూర్ణ ఆశీస్సులు కావాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో మీ సలహాలు, సూచనలకు అనుగుణంగా ప్రచారంలో ముందుకు వెళ్తానని స్పష్టం చేశారు. అనంతరం మైనంపల్లి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో తన సంపూర్ణ సహకారాన్ని అందిస్తామనని మెదక్ పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేస్తానని హామీచ్చారు. పార్లమెంట్ పరిదిలో అందరికి కలుపుగోలుగా ఉంటూ ప్రచారంలో ముందుకు పోవాలని సూచించారు.

## ఇసి నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల విధులు నిర్వహించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా అధికారులు పారదర్శకంగా విధులు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. శనివారం లోకసభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా సమీకృతకలెక్టరేట్‌లో మాస్టర్ ట్రైనర్స్, నియోజకవర్గం స్థాయి మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ కార్యక్రమానికి ఆదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ ఇచ్చారు. ఎలక్షన్ కమిషన్‌ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం మీకు అందించిన పిపిటి హండ్‌బుక్‌ను పూర్తిగా చదివి అర్థం చేసుకోవాలని, హండ్‌బుక్‌ను ఎల్లప్పుడటు మీ వెంట ఉంచుకోవాలని సూచించారు. ఇవిఎం మిషన్లలో బాలెట్ యూనిట్, వివి ప్యాడ్, కంట్రోల్ యూనిట్ అనుసందాన ప్రక్రియ, పోలింగ్‌డే రోజు మాక్ పోల్ ప్రక్రియ పల పత్రాలు నింపే విధానం గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. ఎన్నికల అధికారులు గతంలో పలుమార్లు ఎన్నికల విధులు నిర్వహించాలని అలసత్వం వహించవద్దన్నారు. ప్రతిసారి ఈసికొత్త నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందిస్తుందన్నారు. నియోజక వర్గం స్థాయిలో ప్రిసిడింగ్, అదనపు ప్రిసిడింగ్ అధికారులకు శిక్షణ క్షుణ్ణంగా అందించాలన్నారు.ఏలాంటి సందేహాలు ఎదురైన బుక్‌లో నోట్ చేసుకొని పై అధికారులకు తెలిపి నివృత్తి చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో డిఆర్‌ఓ నాగరాజమ్మ, డిపిఒ దేవకిదేవి తదితరులు పాల్గొన్నారు.



## వేసవి ముగిసేదాకా నిరాటంకంగా తాగునీరు

### వేసవి ముగిసే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ భవేష్ మిశ్రా



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** గ్రామాలలో మంచినీటి సరఫరాలో ఎక్కడైనా అంతరాయం ఏర్పడితే అం దుకు ప్రత్యాన్మయంగా తాగునీరు అందించడానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆర్‌డబ్ల్యుఎస్, గ్రిడ్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వేసవిలో తాగు నీటి ఎద్దడి నివారణకు చేపట్టిన చర్యలు, వివిధ దశల లో ఉన్న పనుల పురోగతిపై ఆర్‌డబ్ల్యుఎస్, గ్రిడ్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలతో గ్రామ పంచాయితీల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ జిల్లాలోని 241 గ్రామ పంచాయతీలలో వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. సుదీర్ఘ సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గ్రామ పంచాయతీ వారిగా పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను మంచినీటి సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో మరమ్మత్తులలో ఉన్న బోర్లు, చేతి పంపులు, మంచినీటి పైపులైన్లు లీకేజి మరమ్మత్తులు, నూతన పైపు లైన్ల నిర్మాణానికి ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌డిఎఫ్) డిఎంఎఫ్‌టి నిధుల నుండి అన్ని గ్రామ పంచాయతీలకు 3.91కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మంచినీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు అందచేసిన నివేదికలు ఆధారంగానే నిధులు మంజూరు చేశామన్నారు. ఎక్కడైనా మంచినీటి సరఫరాలో ఇబ్బంది వస్తే తక్షణమే తన దృష్టికి తేవాలని తెలిపారు. వేసవిలో నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైనప్పుడు ప్రత్యామ్నయ ఏర్పాట్లుతో నీటి సరఫరాకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. మంచినీటి వనరులు మాత్రమే కాకుండా ప్రైవేటు బోర్లు, బావుల ద్వారా గ్రామాలలో నీటిని అందించడానికి సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామాలలో ప్రైవేటు బోర్లు, బావులు ఇతర నీటి వనరుల వివరాలు సేకరించి నివేదికలు అందుబాటులో ఉంచుకోవాలని, అత్యవసర పరిస్థితులలో వాటి ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేయాలని అన్నారు. గ్రామాలలో మరమ్మతులు జరుగుతున్న బోర్లు, చేతి పంపులను ఏప్రిల్ 04వ తేదీ వరకు పూర్తి చేసి నివేదికలు అందచేయాలని, ఎక్కడైనా మరమ్మత్తులు పూర్తికాకపోతే అందుకు కారణాలను ఎంపిడిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది సంయుక్తంగా ధృవీకరణతో నివేదికలు అందచేయాలని ఆదేశించారు. వేసవి కాలం ముగిసేంత వరకు అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎక్కడా తాగునీటికి ఇబ్బంది రావొద్దని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జడ్‌పి సిఇఒ విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ నిర్మల, డిపిఒ నారాయణరావుతో పాటు మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలు, ఆర్‌డబ్లూఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/మంగపేట :** నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శనివారం గోవిందరావుపేట మండలంలోని బుస్సాపూర్, దుబ్బగూడెం, తాతయ్య పల్లి గ్రామాల్లో నీటి సరఫరా స్థితిగతులను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామాల్లో పర్యటించి స్థానికులను నీటి సరఫరా తీరును అడిగి తెలుసుకుంటూ ప్రతిరోజు ఎంతసేపు నీరు సరఫరా అవుతుంది...? నీటి సరఫరా తీరును అధికారులు పర్యవేక్షిస్తున్నారా..? అని క్షేత్ర స్థాయి స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఎన్ని నల్లా కనెక్షన్‌లు ఉన్నాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరా తీరును స్థానికులను అడిగి తెలుసుకొని నీటి వృధాను అరికట్టాలని, అవసరాల మేరకు నీటిని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవికాలంలో ఎండల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున గ్రామాలలోని నీటి నిలువలను వృధా చేయకుండా సక్రమంగా ఉపయోగించుకోవాలని కోరారు. ఏటూరు నాగారం మండలం రాంనగర్, వాజేడు మండలంలోని పూసూరు, రామప్ప సరస్సులోని పంపు హౌస్‌ల ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలకు తాగునీరు అందించడం జరుగుతుందని తెలిపారు. అధికారుల అంచనాల ప్రకారం ఇప్పటివరకు ములుగు ప్రాంతంలో ఎలాంటి త్రాగునీటి సమస్య లేదని అయినప్పటికీ ప్రజలు తాగు నీటని వృధా చేయరాదని నిత్యవసర అవసరాలకు ముడి నీరును ఉపయోగించుకోవాలని కోరారు. గ్రామాలలో ఉన్నటువంటి బోర్ వెల్స్ పనితీరును గ్రామాల ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని అన్నారు. ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రస్తుతం ఉన్న నీటి వనరులను ఉపయోగించుకుంటూ, గ్రామాల్లో మరమ్మత్తులలో ఉన్న చేతి పంపులు, బోర్లు, మంచినీటి బావులు, తదితర వాటర్ సప్లై వనరులను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ విద్యుత్ నాగేశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ అధికారి హజార్ సయ్యద్, గ్రిడ్ అధికారిని సంధ్యారాణి, ఎంపిడిఒ జోహార్ రెడ్డి, ఎంపిఒ సాజిదా బేగం, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** రాజకీయ ప్రకటనలకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ స్పష్టం చేశారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని రూం నెం G1లో శనివారం అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వెంకటేశ్వర్లతో, జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఎంసిఎంసి మీడియా సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎంసిఎంసి సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటన ప్రసారం చేయడం సంబంధిత, అభ్యర్థి ప్రచార వ్యాయంలో లెక్కించడం, సోషల్ మీడియాలో అభ్యర్థులు రాజకీయపార్టీల ప్రకటన వంటి వాటిని సకాలంలో ఆమోదిస్తూ మంజూరు చేయాలని సూచించారు. శాటిలైట్ చానల్స్‌లో వచ్చే వార్తలను పూర్తి స్థాయిలో రికార్డు చేయాలన్నారు. వార్తా పత్రికలు, ఈ పేపర్లు, టెలివిజన్ ఛానళ్లు, స్థానిక కేబుల్ నెవట్‌వర్క సోషల్ మీడియా, మూవీహౌస్‌లు సంక్షిప్త సందేశాలు ఇతర ఆడియో వీడియో విజువల్ మీడియాలతో సహా ప్రకటనలు ఎంసిఎంసి నుండి ముందస్తు పొందిన తర్వాత మాత్రమే విడుదల చేయాల్సి ఉంటుందని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్టప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ప్రచురితమయ్యే రాజకీయ ప్రకటన పరిశీలించి పేడ్ న్యూస్ పరిశీలనకై మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఎంసిఎంసి మీడియా సెంటర్‌ను ఉపయోగించుకోవాలని కలెక్టర్ తెలియజేశారు. ఓటర్‌లను మభ్యపెట్టేందుకు ఎవరై నా అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువులను పంపిణీ చేయడం, ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడే వాటిని లైవ్ ఫోటోలు, లైవ్ వీడియోలను సి విజిల్ యాప్ ద్వారా తీసి పంపాలని కలెక్టర్ సూచించారు. అంతేకాకుండా 1950 టోల్ ఫ్రీకి ఫోన్‌లో సమాచారం ఇవ్వాలని, 24 గంటలు అందుబాటులో ఉంటుందని, ప్రజలు సంప్రదించాలని జి ల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఎన్నికల నియమావళిలో బాగంగా వివిధ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, పబ్లిక్ మీ టింగ్‌లు, లాంటి అన్ని రకాల అనుమతుల కోసం సువిధా ఆన్‌లైన్ పోర్టల్‌లో ధరఖస్తు చేసుకోని, అనుమతి పొందాలన్నారు. ఈ కార్యక్రమం లో ఎలక్షన్ సూపరింటెంట్ హర్దీప్ సింగ్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, నోడల్ అధికారులు ఎలక్షన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులు ఎంపి పోటీకి అర్హులు కాదా?

### మెదక్ బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** బిఆర్ఎస్ పార్టీలో మెదక్ ఎంపి అభ్యర్థికి ఉద్యమకారులు అర్హులు కాదా అని బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలో బిజెపి మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రఘునందన్ రావు హాజరైమాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు కోసం ఎంతోమంది ఉద్యమించారని వారిని మరచి టిఆర్ఎస్ పార్టీ స్థానికేతరుడైన మాజీ కలెక్టర్ వెంకట్రాం రెడ్డికి మెదక్ ఎంపి టికెట్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. తెలంగా ణ ఉద్యమ కారులకు బిఆర్ఎస్‌లో తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో ఎంపి టికెట్ ఇస్తామని, స్థానికులైన మాజీ ఎంఎల్‌ఎ మదన్ రెడ్డికి మాజీ ఫారెస్ట్ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డిలకు ఎంపి టికెట్ ఇవ్వకుండా బిఆర్ఎస్ అధిష్టానం మోసం చేసిందన్నారు. కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీలో కుంభకోణాలు బయటపడుతున్నాయన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి డిసెంబర్ నెల లో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానన్న హామీ ఏమైంది అని అన్నారు. నర్సాపూర్ ఎంఎల్‌ఎ సునీత రెడ్డి పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లడం ఖాయమన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమించిన ఉద్యమకారులు మాజీ ఎంఎల్‌సి ఆర్ సత్యనారాయణ, బీరయ్య యాదవ్, లాంటి వ్యక్తులు ఎందరో ఉన్నారని. వారిని మరచి కోట్ల ఆస్తులున్న వారికి మెదక్ ఎంపి టికెట్ ఇవ్వడం సరికాదన్నారు. ప్రస్తుతం దేశంలో నరేంద్ర మోడీ పా లన ను ప్రజలందరు అంగీకరిస్తున్నారని దీంతో దేశ ప్రజలందరూ మూడవసారి మోడీని ప్రధానమంత్రి చేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. తనను మె దక్ ఎంపిగా గెలిపిస్తే పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ యాదవ్, ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపా గారి రమేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోడ రాజేందర్ తదితరులున్నారు.

# అందరిచూపు ఆత్రం సుగుణక్క వైపే

కమ్యూనిస్టు భావాల గల ఆదివాసి మహిళా అభ్యర్థి వైపే ముగ్గు

హస్తం – కమలం మధ్య కారు స్పీడ్ ఎంత?

**ఆత్రం సుగుణక్క టీచరమ్మగానే తెలుసు..ఒకప్పుడు కమ్యూనిస్టులకు అడ్డాగా ఉన్న ఆదిలాబాదు జిల్లాలో ఎన్నో ఆదివాసీ ఉద్యమాలతో పాటు కమ్యూనిస్టు పార్టీల అంచున ఉంటూ బడుగు బలహీన వర్గాల పోరాటంలో తన వంతు పాత్ర పోషిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలిచింది. భర్త ఆత్రం భుజరంగరావు కమ్యూనిస్టు భావజాలం గల వ్యక్తి, మానవ హక్కుల కమిటీ,పౌర హక్కుల కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తూ, ఏజెన్సీ ప్రాంతంలో ఎన్నో సమస్యలను పరిష్కరించి ఎంతో గుర్తింపు పొందారు. ఇప్పుడు కూడా ఆదిలాబాద్ పార్లమెంటు అభ్యర్థిగా టికెట్ రావడం కమ్యూనిస్టు భావాలు ముఖ్యపాత్ర పోషించాయని ఆయా ఏజెన్సీ గూడెలలో, పల్లెలలో గుసగుసలాడుతున్నారు.**





**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ వడపోసి వడపోసి చివరకు ఉపాధ్యాయురాలు ఆత్రం సుగుణక్కకు జై కొట్టింది. ఈ చర్యతో అదిలాబాద్ జిల్లా మొత్తం మరో చర్చకు దారితీస్తుందని చెప్పాలి. నాలుగు దశాబ్దాల రాజకీయ ఉనికి చాటుకున్న గోడం నగేష్ కారు దిగి కమలం వైపు వెళ్లి టికెట్ తెచ్చుకున్నా అంతగా ఆకట్టుకునే పరిస్థితి కనిపించట్లేదు. ఉమ్మడి జిల్లాలో కాషాయ పార్టీ నాలుగు స్థానాలు గెలిచినా చివరకు కాంగ్రెస్ వైపే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. బిజెపి కార్యకర్తలు కోరుకున్న అభ్యర్థిని ఎంపిక చేయకపోవడం బిజెపికి పెద్ద మైనస్ అని చెప్పాలి. ఆత్రం సుగుణక్క అంటే అందరికీ తెలిసిందే కమ్యూనిస్టు భావజాలంతో పేదల పక్షాన పోరాడే ఉద్యమ నాయకురాలుగా పేరుపొందారు. బడి పిల్లలకు పాఠాలు బోధిస్తూనే ఓ పక్క ఆదివాసులను చైతన్యపరుస్తూ ప్రజలలో తమకంటూ గుర్తింపు తెచ్చుకుంది. టికెట్ వచ్చినా రాకపోయినా కాంగ్రెస్ పార్టీ తరుపున వాడవాడకు గ్రామ గ్రామానికి పల్లె పల్లెకు గూడేలలో పర్యటించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని టికెట్ ఎవరికి వచ్చిన సంతోషిస్తామంటూ కాంగ్రెస్లో పోటీ పడిన అభ్యర్థులు రాజీకి రావడం కాంగ్రెస్ పార్టీ గెలుపుకు నాంది పలికినట్లే. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే చేరికలతో బలమైన పునాది చేసుకోవడం కాంగ్రెస్ పార్టీతో పాటు కమ్యూనిస్టులు ఆమ్మ్ ఆద్మీ పార్టీ సపోర్ట్ ఉండడం కాంగ్రెస్కు మరింత కలిసోచ్చే అంశం ఉంది. బిజెపి హిందుత్వవాదంతో మైనార్టీలను బెదిరింపులకు గురిచేస్తూ మతాత్వ రాజకీయాలు చేయడంతో జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు గెలిచినప్పటికీ అప్పటి సమీకరణాలకు ఇప్పటి సమీకణలకు 80 శాతం సమీకరణలు మారాయి అని చెప్పాలి. అందరు అనుకున్నట్లు మోడీని గెలిపిస్తారని ప్రచారం జరుగుతున్నా మోడీకి వ్యతిరేకంగా వ్యూహం రచించే వారు అనేకంగా కనిపిస్తున్నారు. లంబాడి సామాజిక వర్గం సమావేశాలు పెట్టి ఆదివాసులకు వ్యతిరేకంగా కామెంట్స్ చేయడం కాంగ్రెస్ పార్టీకూడా అనుకూలమైన, కొన్ని కులాలు ఆదివాసుల పట్ల సానుభూతితో ఓటు వేసే అవకాశం కూడా లేకపోలేదు. ఎందుకంటే లంబాడ జాతి ఇప్పటికే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయాల్లో ఆరి తేరిన విషయం తెలిసిందే.లంబాడాలకు టికెట్లు ఇవ్వక ముందే రాజకీ య కులాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ నాయకుల పై మాట్లాడుతున్నారని, ఇలాంటి పరిస్థితులలో ఆదివాసులే బెటర్ అన్న ప్రచారం కూడా జరుగుతుంది. జిల్లా లో బిజెపి,టీఆర్ఎస్ కాంగ్రెస్ ముగ్గురు ఆదివాసీ అభ్యర్థులు కావడం గట్టి పోటీ ఇస్తుందేమో కానీ మహిళా అభ్యర్థి వైపే మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తుంది.

**హస్తం కమలం మధ్య కారు స్పీడు ఎంత ?**

ఆదిలాబాద్ జిల్లా ఆదివాసి ఖిల్లాలో ఉపాధ్యాయవృత్తితో ఉన్నావారు పార్లమెంట్కు పోటీ పడుతున్నారు. ముగ్గురిలో ఇద్దరికి మాత్రం కమ్యూనిస్టు భావజాల గల వ్యక్తులు, ఉద్యమ నాయకులుగా గుర్తింపు ఉంది. ఒకరు ఆత్రం సుగుణక్క అయితే మరొకరు ఆత్రం సక్కుబాయి, సామాన్య ప్రజలకు బడుగు బలహీన వర్గాలకు దగ్గరగా ఉండి సేవలు చేసిన వ్యక్తులుగా గుర్తింపు ఉన్న నాయకులుగా ఉన్నవారు.ఒక్కరు తండ్రి రాజకీయ వారసత్వంగా పంచుకొని కాషాయ పార్టీ తరుపున పోటీ చేస్తున్న గోడం నగేష్, జిల్లాలో కాషాయ పార్టీకి నలుగురు ఎమ్మెల్యేలను గెలిపించినా అది వ్యక్తిగత గెలుపేనాని చెప్పాలి. ఇలాంటి పరిస్థితులలో కారుకు హస్తం పార్టీలకే అవకాశలు ఎక్కువ కనిపిస్తున్నాయి.40 సంవత్సరాల రాజకీయ చరిత్రలో గోడం నగేస్ ఏ ఒక్క బడుగు బలహీన వర్గాల మంచి చెడులు తెలియని వ్యక్తిగా ముద్ర పడింది.ఎప్పుడు కూడా ప్రజలకు అందుబాటులో ఉండకుండా హైదరాబాద్ సిటీలో ఉంటూ ఆదివాసులను తీవ్రమైన వెనుకబాటుకు కారకులని విమర్శలు కూడా లేకపోలేదు.ఇలాంటి రాజకీయ పరిస్థితులలో ఇప్పటికే బిఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు ఆసిఫాబాద్, సిర్పూర్, కాగజనగర్, భోథ్,ఖానాపూర్, నియోజవర్గంలో మంచి పట్టు ప్రచారంతో దూసుకుపోతుంటే, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణకు కూడా పల్లె పల్లెకు తిరుగుతూ ప్రచారం చేస్తూ దూసుకుపోతుంది.ఓ పక్క మహిళా అభ్యర్థిగా మహిళలలో మంచిపట్టు సాధించే దిశగా వెళుతుంది.హస్తం కమలం మధ్యలో కారు గెలిచిన ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదు.అదిలాబాదులో కారు హస్తం మధ్యన పోటీ జరుగుతుందన్న గుసగుసలు కూడా మొదలయ్యాయి.కమలం పార్టీ అభ్యర్థి గోడం సగేష్ కు మొదటి నుంచి వర్గ పోరు తోపాటు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుంది తెలిసిందే. మరి ఎన్నికల వరకు పరిస్థితులు ఇలాగే ఉంటే కారు.లేదా చేతు గెలిచే అవకాశాలు కూడా లేకపోలేదు.

## ఎంపిపిపై నెగ్గిన అవిశ్వాసం



**ప్రజాపక్షం/సిర్పూర్ టి :** సిర్పూర్ టి మండలంలో శనివారం రోజున మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవిశ్వాసా సమావేశంలో ఎంపిపి చునర్కర్ సువర్ణకు వ్యతిరేకంగా ఏడుగురు ఎంపిటిసిలు చేతులేత్తి తమ నిర్ణయాన్ని తెలిపారు. మండలంలో మొత్తం 8మంది ఎంపిటిసిలు ఉండగా ఏడుగురు అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు. సానుకూలంగా స్పందించిన ఆర్‌డివొ చునర్కర్ సువర్ణపై అవిశ్వాసం నెగ్గిందని తెలిపారు. అవిశ్వాస తీర్మాణాన కార్యక్రమానికి సిఐ శాదిక్ పాషా ఆధ్వర్యంలో ఎస్ఐ ది కొండ రమేష్ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఎంఎల్ఎకు కాంట్రాక్ట్ కార్మికుల విన్నపం



**ప్రజాపక్షం/యైటింక్లయిన్ కాలనీ :** రామగుండం ఎంఎల్ఎ రాజ్ ఠాగూర్ మాక్కాన్ సింగ్కు శనివారం ఎఐటియుసి అనుబంధ సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సభ్యులు సమస్యలు విన్నవించుకున్నారు. ఎంఎల్ఎను కలిసిన యూనియన్ నాయకులు బుర్ర తిరుపతి, ఎం.ఎ.గౌస్, ముందుగా ఎంఎల్ఎకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం కాంట్రాక్టు డ్రైవర్ల, ఇతర పనులు చేస్తున్న కార్మికుల జీతభత్యాలు, ఇంకా ఇతర సమస్యలను ఎంఎల్ఎకు వివరించారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎంఎల్ఎ రాజ్ ఠాగూర్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## అవకాశమిస్తే ఎంపిగా పోటీచేస్తా..



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** అవకాశమిస్తే కరీంనగర్ ఎంపిగా పోటీచేస్తానని మాజీ శాసన సభ్యులు కటుకం మృత్యుంజయం పంతులు తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో హైదరాబాద్‌లో కలిశారు. మర్యాద పూర్వకంగా రేవంత్‌రెడ్డిని కలసి శాలువా కప్పి సన్మానించారు. ప్రవీణ్‌రెడ్డికి, లేదా తనకు అవకాశం ఇస్తే ఎంపి ఎన్నికల్లో బరిలో ఉంటానని చర్చించినట్టుగా తెలిస్తోంది. కరీంనగర్ ఎంపి సీటుకోసం మూడు ప్రధాన పార్టీలు నిలుస్తున్నాయన్నారు. బిఆర్ఎస్ నుండి బోయినపల్లి వినోద్‌కుమార్, బిజెపి నుండి బండి సంజయ్ నిలుస్తుండగా తాజాగా తీన్మార్ మల్లన్న కూడా కాంగ్రెస్ పార్టీ నుండి వెలిచల రాజెందర్‌రావ్, టికెట్ కోసం ఆశిస్తున్నట్లుగా విశ్వయనీయంగా తెలుస్తోంది.

## ప్రభుత్వ భూముల కబ్జాలపై అధికారుల కొరడా



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** పట్టణంలోని శాంతినగర్ లోని ఎఫ్ఎస్‌సిఎస్ రైతు సహకార సంఘానికి చెందిన స్థలంలో గత ప్రభుత్వ హయంలో మాజీ మంత్రి అనుచరుల కబ్జా చేసి రేకుల షెడ్డు నిర్మించారు. అనేక సార్లు రైతు సహారా సంఘం అధికారులు తొలగించాలని నోటీసులు ఇచ్చిన అధికార అడ్డుపెట్టుకొని తొలగించుకోవడంతో, మొన్న జరిగిన ఎన్నికలలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఓడిపోవడం వారి అనుచరులు టిఆర్ఎస్ పార్టీ నాయకులు అక్రమాలపై బిజెపి ఎంఎల్ఎ ఏలేటి మహేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చిన సభ్యులు, రైతులు, ప్రభుత్వ భూముల కాపాడాలని అధికారులకు ఎంఎల్ఎ అదేశించారు. ప్రభుత్వ భూమిలో కబ్జాలో నిర్మాణాలు తొలగించే అధికారులుకు ఎవరైనా అడ్డుపడితే చర్యలు ఉంటాయని హెచ్చరికలు జారీ చేశారు. నిర్మల్‌లో ఇంకా అనేకంగా శిఖం భూములను లేఅవుట్లు చేసి అమ్ముతున్న మాజీ మంత్రి అనుచరుల అక్రమపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్‌కు బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోరడంతో అధికారులు అక్రమాలపై దృష్టి సారిస్తున్నారు.

## రైల్వే అండర్ బ్రిడ్జి స్థలం పరిశీలన

ఎంఎల్ఎ పాల్వాయి హరీష్ బాబు



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ పట్టణంలోని సంజీవయ్య కాలనీ వద్ద ఇటీవల మంజూరైన రైల్వే అండర్ బ్రిడ్జి స్థలాన్ని, రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను సిర్పూర్ నియోజకవర్గ ఎంఎల్ఎ పాల్వాయి హరీష్ బాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులకు నష్టం జరగకుండా వంతెన నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని, కాలనీ వాసులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పట్టణ అభివృద్ధికి అందరు సహకరించాలని, రైల్వే లైన్ అవతల ఉన్న వారికి, పెద్దవాగు రోడ్డులో ఉన్న మోక్ష దాహంకు అండర్ బ్రిడ్జి ఎంతో అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఎల్లేష్. నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## నృసింహుని దర్శించుకున్న ప్రభుత్వ విప్



**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లా ధర్మపురి లక్ష్మి నృసింహ స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి ఎంఎల్ఎ అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ శనివారం దర్శించుకున్నారు. అడ్లూరి తొలుత ప్రధానాలయం యోగానంద స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు, అర్చకులు ఆయనకు ఘనంగా ఆశీర్వచనం చేశారు. దేవస్థాన ఇఒ సంకటాల శ్రీనివాస్ స్వామివారి శేష వస్త్రంతో ఆయనను సత్కరించి లడ్డు ప్రసాదం అందించారు. అనంతరం అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అనుబంధ ఆలయాలలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సంగనబ్ల దినేష్, ఉపాధ్యాక్షుడు వేముల రాజేష్, కుంట సుధాకర్, సుముఖ్, సంగ నర్సింహులు, అప్పం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## కులవివక్ష చూపితే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/రామగిరి :** కుల వివక్ష చూపితే కఠిన చర్యలు తప్పవని పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ తహసిల్దార్ ఆరిపోద్దీన్ అన్నారు. కమాన్‌పూర్ మండలం నాగారం గ్రామ పంచాయతీ పరిధిలోని లింగాల గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ ఆరిపోద్దీన్ మాట్లాడుతూ గ్రామాల్లో కలిసికట్టుగా ఉండాలని కుల వివక్ష చూపకూడదు అని అన్నారు. దేవాలయాల్లో వివక్ష చూపకూడదని ప్రతి ఒక్కరికి దేవాలయంలో వచ్చేలా చూడాలని అన్నారు. కుల వీక్ష చూపితే కఠిన చర్యలు తప్పవని అని అన్నారు. ఈ కార్యక్రమానికి కమాన్ పూర్ ఎస్ఐ 2 జక్కు రవళి, ఎఎస్ఐ బాలాజీ నాయక్, హాస్టల్ వార్డెన్ వెంకట స్వామి, మానవ వికాస వేదిక రాష్ట్ర కళామండలి అధ్యక్షులు దాసరి రామస్వామి, పొనగంటి రవి, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు అంబటి కనకయ్య , గ్రామస్తులు పాల్గొన్నారు.



## వందరోజుల పాలనలో రైతుల రోదనలే మిగిలాయ్

మాజీ మంత్రి, ఎంపి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

36 గంటల నిరసన దీక్ష ప్రారంభం



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** కాంగ్రెస్ వంద రోజుల పాలనలో రైతుల రోదనలే మిగిలాయని మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం 36 గంటల రైతు నిరసన దీక్షను ఆయన ప్రారంభించి అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగాన్ని ప్రజాపాలన ప్రభుత్వం నట్టేట ముంచిందని, యాసంగి పంటకు సాగునీరు అందించలేదని దుస్థితి నెలకొందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ వంద రోజుల్లో రైతుల కంట కన్నీరు తెప్పించిందని అన్నారు. ఎల్లంపలి, ఎస్సారెస్పీ ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నా సాగు నీరు అందించకుండా పంటలు ఎండబెడుతుందని అన్నారు. మోసపూరిత మాటలు కాంగ్రెస్‌కు అలవాటేనని, ఆదే రీతిలో రైతులను మోసం చేసిందని ఎద్దేవా చేశారు. సాగునీరు లేక వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ సర్కార్‌లో చలనం కన్పించడం లేదని, రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. ఎండిన పంటలకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం అందించాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంఎల్ఎ కోరుకంటి చందర్, పెద్దపల్లి మాజీ ఎంఎల్ఎ దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే కరువుకు నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రైతులను దగా చేశారని, పంటల సాగుకు సాగునీరు అందించక వడంతో పాటు రైతుబీమా, రైతుబంధుతో పాటు రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని ఎద్దేవా చేశారు. పంట నష్టపోయిన రైతులకు అండగా నిలుస్తామని, నష్టపరిహారం అందించే వరకు పోరాటం చేస్తామని వారు స్పష్టం చేశారు. 36గంటల రైతు నిరసన దీక్షలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్ వేములవాడ ఎంఎల్ఎ ఆది శ్రీనివాస్ అన్నారు శనివారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ బెజ్జారపు శ్రీనివాస్ సాయి శ్రీనివాస హాస్పిటల్‌లో మర్యాదపూర్వకంగా ఆయనను కలవడం జరిగింది. ఈ సందర్భంగా వేములవాడ ఎంఎల్ఎ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని చూస్తు రాష్ట్ర ప్రజానీకం కాంగ్రెస్ వైపు మొగ్గ చూపుతున్నారన్నారు. సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారని ఆయన మనోగతాన్ని వ్యక్తం చేశారు. అనంతరం డాక్టర్ శ్రీనివాస్ ఇచ్చిన తేనేటి విందును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ మేనేజ్‌మెంట్ డాక్టర్ అవుట్ల లక్ష్మ ణ్, రాష్ట్ర మైనార్టీ నాయకుడు అబ్దుల్ ఆఫీస్, మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ రాజు, పట్టణ కార్యదర్శి కంబ సురేష్‌లతో పాటు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

బిజెపి ఎంపి అభ్యర్థి గోడం నగేష్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను అడుగడుగున ఎండగట్టాలని, రానున్న లోక్ సభ ఎన్నికల్లో బిజెపి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని బిజెపి అభ్యర్థి గేడం నగేష్ అన్నారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రంలో జరిగిన బిజెపి మండల కార్యవర్గ సమావేశానికి బిజెపి అదిలాబాద్ ఎంపి అభ్యర్థి గోడం నగేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లో అవగాహన కల్పించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలోని వట్టివాగు, చెలమల వాగు సంబంధించిన సమస్యలతో పాటు ఆడ ప్రాజెక్టుకు సంబంధించిన కాలువల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అలాగే గంగాపూర్ గ్రామానికి వెళ్లే మార్గంలో ఫ్లైఓవర్ నిర్మించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటు ప్రాముఖ్యత వివరిస్తూ స్వీప్ కార్యక్రమాలు

అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** బాధ్యత గల పౌరులుగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటు ప్రాముఖ్యత వివరిస్తూ స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్‌లో పార్లమెంట్ ఎన్నికలలో పోలింగ్ శాతం పెరిగేలా స్వీప్ కార్యక్రమాలు నిర్వహణపై స్వీప్ కోర్ కమిటీ సభ్యులతో సమీక్షించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న 2 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో మొత్తం 4 లక్షల 70 వేల 438 మంది ఓటర్లు ఉన్నారని, ప్రతి ఒక్క ఓటరు ఎన్నికలలో తప్పనిసరిగా తమ ఓటు హక్కు వినియోగించుకోనేలా ఓటు ప్రాముఖ్యతపై విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదయ్యే విధంగా ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గత ఎన్నికలలో తక్కువ పోలింగ్ నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. స్వీప్ కార్యక్రమాలలో భాగంగా జిల్లాలో ఉన్న అన్ని విద్యాసంస్థల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని, జిల్లాలో ఉన్న అన్ని డిగ్రీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ అంబాసిడర్లను నియమించాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేసి వారి ఓటుహక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఓటు హక్కు ప్రాముఖ్యత వివరించే విధంగా కర పత్రాలను పంపిణీ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో స్వీప్ కోర్ కమిటీ సభ్యులు జిల్లా నోడల్ అధికారి శ్రీనివాస్, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శ్రీధర్ డిపిఆర్ఒ శ్రీధర్, ప్రసార భారతి ఆల్ ఇండియా రేడియో లక్ష్మీనారాయణ డిపిఒ వీర బుచ్చయ్య , డిఇఒ రమేష్ కుమార్ డిఎం అండ్ హెచ్ సుమన్ మోహన్ రావు పాల్గొన్నారు.

## క్రీడలలో ప్రతిభ గల బాలికలకు ప్రోత్సాహం



అదనపు కలెక్టర్ అరుణశ్రీ

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** క్రీడలలో మంచి ప్రతిభ కనబరిచిన బాలికలను ప్రోత్సహించేందుకు వారికి నగదు బహుమతులు అందించామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. క్రీడలలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు శనివారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో నగదు ప్రోత్సాహక బహుమతినీ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ బేటి బచావో, బేటి పడావో కార్యక్రమంలో భాగంగా క్రీడలలో ఆసక్తి చూపుతూ మంచి ప్రతిభ కనబరుస్తున్న జిల్లా విద్యార్థినులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బహుమతి క్రింద నగదు పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్ణయించామని, పెద్దపల్లి జిల్లాలో ఉన్న 14 మండలాల వారీగా జిల్లా విద్యాశాఖ అధికారి నేతృత్వంలో నిర్వహించిన క్రీడా పోటీలలో మంచి ప్రతిభ కనబరిచిన 14 మంది బాలికలను ఎంపిక చేసి ఒక్కొక్కరికి 3 వేల 300 రూపాయలు ప్రోత్సాహకం చొప్పున చెక్కులు అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేష్, పిఇటి ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రి బ్రాహ్మణ సంఘ భవనం ప్రారంభం



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** పట్టణంలో నూతనంగా నిర్మించిన గాయత్రి బ్రాహ్మణ సంఘ భవనమును ప్రారంభించిన ఖానాపూర్ నియోజకవర్గ ఎంఎల్ఎ వెడ్మాబొజ్జు పటేల్, ఆదిలాబాద్ ఎంపి అభ్యర్థి సుగుణక్క, అనంతరం ఎంఎల్ఎని శాలువాతో ఘనంగా సన్మానించిన గాయత్రి బ్రాహ్మణ సంఘం సభ్యులు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి ఆత్రం సుగుణ, మాజీ ఎంఎల్ఎ రేఖ నాయక్, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్,మండల అధ్యక్షులు దొనికేని దయానంద్ పార్టీ మండల జనరల్ సెక్రెటరీ షబ్బీర్ పాషా, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో బిజెపికి గెలుపు ధీమా



బిజెపి అభ్యర్థి గోమాసే శ్రీనివాస్

**ప్రజాపక్షం/పెద్దపల్లి జిల్లా ప్రతినిధి :** పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో బిజెపి గెలుపు ఖాయమైందని, దేశ వ్యాప్తంగా బిజెపి గెలవబోతున్న 4వందల స్థానాల్లో పెద్దపల్లి పేరు ఉండబోతుందని బిజెపి అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో శనివారం ప్రచారం చేపట్టారు. అనంతరం అమరచంద్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, మూడవసారి ప్రధానిగా మోదీ ప్రమాణస్వీకారం చేసే ముహూర్థం ఖరారయ్యిందన్నారు. పెద్దపల్లిని పాలించిన గత పాలకులు అర చేతిలో వైకుంఠం చూపించి అభివృద్ధిని మరిచిపోయారని, ఇక్కడి ప్రజలను మోసం చేసి (కాక)వెేక్ కుటుంబం పదవులు అనుభవించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు నియోజకవర్గాల అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని, ఆరు గ్యారెంటీల అమలు చేయించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలం అయ్యిందని దుయ్యబట్టారు. పెద్దపల్లి పార్లమెంటులో బిజెపి గెలుపు ఖాయమైందని, గెలిచిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సమయాన్ని కేటాయిస్తానని శ్రీనివాస్ హామీ ఇచ్చారు. తనకు అవకాశం ఇచ్చి ఎంపిగా గెలిపించాలని ఓటర్లను గోమాసే శ్రీనివాస్ కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, పార్లమెంటు కన్వీనరు వెంకటేషం గౌడ్, కో కన్వీనరు గుండబోయిన లక్ష్మ న్, నాయకులు శిలారపు పర్వతాలు, తంగెడ రాజేశ్వరరావు, వివిధ మండలాల అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇంచార్జీలు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** లోక్‌సభ ఎన్నికలలో పోలింగ్ రోజున అర్హత గల ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రం లోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు స్వీప్ ఆక్టివిటీస్‌లో భాగంగా చేపట్టిన 5కె రన్ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు తో కలిసి జెండా ఊపి ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత పౌరులకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఈ హక్కును సక్రమంగా వినియోగించుకుని అభివృద్ధికి పాటుపడే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని అన్నారు. పోలింగ్ శాతాన్ని పెంపొందించే విధంగా కళాజాత ప్రదర్శన, ఇంటింటి ప్రచారం, వివిధ రకాల విసృత ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యపర్చడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో స్వీప్‌లో భాగంగా ఓటు వినియోగం, ప్రాముఖ్యత తెలియజేసేందుకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఏప్రిల్ 1, 2024 తేదీని ప్రామాణికంగా తీసుకొని 18 సం.లు వయస్సు నిండే ప్రతి ఒక్కరు ఏప్రిల్ 15వ తేదీ లోగా తమ వివరాలు నమోదు చేసుకొని నూతన ఓటరు కార్డు పొందాలని తెలిపారు. ఎన్నికలలో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా పోలింగ్ రోజున నిస్పక్షపాతంగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినట్లయితే టోల్ ఫ్రీ నం.1950, సివిజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం అందరితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు, జిల్లా అధికారులు, యువతీ, యువకులు, విద్యార్థులు, బూత్ స్థాయి అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం శాంతికాముకులు పోరాడాలని అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ పిలుపునిచ్చారు. అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం జిల్లా సమితి సమావేశం శనివారం జరిగింది. సమావేశానికి కెవిఎల్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ దేశాల మధ్య సోదర భావం నెలకొల్పి ప్రపంచశాంతికి పాలకులు కృషి చేయాలని అన్నారు. దేశంలో మతసామరస్యాన్ని నెలకొల్పి రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పాటుపడాలని అన్నారు. ప్రపంచంలో ఘర్షణలకు తావు లేకుండా యుద్ధ రహిత సమాజం కోసం శాంతికాముకులు, మేధావులు అభ్యుదయ వాదులు అందరు కృషి చేయాలని కోరారు. దేశంలో జరగబోతున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని సెక్యులరిజాన్ని కాపాడే వారిని ఎన్నుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు కట్ట వెంకటరెడ్డి, గుర్రం వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జిల్లా యాదయ్య, ఉపాధ్యక్షులు కోమటిరెడ్డి ప్రద్యుమ్నా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలు ఇవ్వండి

సూపరింటెండెంట్‌కు ఎఐటియుసి మెమొరండం



**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికుల నాలుగు నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాములునాయక్‌కు ఎఐటియుసి ఆధ్వర్యంలో మెమొరండం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా పెండింగ్లో ఉన్న వేతనాలు ఇవ్వకుంటే కార్మికులు జీవనం ఎలా సాగిస్తారని, ప్రభుత్వం ప్రతి నెల ఒకటో తారీకు నాడే వేతనాలు ఇవ్వాలని అన్నారు. కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, కనీస వేతనాలు ఇచ్చి వారిని ఆదుకోవాలని అన్నారు. పెండింగ్ బకాయి వేతనాలు ఇవ్వకుంటే ఏప్రిల్ 01 నుండి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటి హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న కార్మికులు సమ్మెలోకి వెళ్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి మల్లయ్య, కార్మికులు రామేశ్వరయ్య, తారమ్మ, వెంకటయ్య, కాశయ్య, శ్రీను, సరిత, ఆదిలక్ష్మి , పద్మ, లక్ష్మమ్మ, శాంతి పాల్గొన్నారు.

## నాటిక విలువను యువత గుర్తించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నాటికలు సమాజ మార్పుకు ఉపయోగపడేవిధంగా ఉండాలని, ముఖ్యంగా యువత నాటిక విలువలపై అవగాహన కలిగి ఉండాలని ఉపాధ్యాయు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్‌లు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాషా సంస్కృతి శాఖ, మిర్యాలగూడ సంస్కృతిక కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ పద్య, సాంఘీక నాటక పోటీలను శనివారం రవీంద్రభారతిలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాత, మనోరమా, నాన్న నేను వచ్చేస్తా, మూల్యం, సాంఘీక నాటక ప్రదర్శనలను చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కళా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్ రామకృష్ణ, కళా కేంద్రం అధక్షుడు బోయినపల్లి భుజంగరావు, పులి కృష్ణమూర్తిశర్మ, రామావతారం, ఉపేందర్, శ్రీనివాస్‌రావు, బాపనయ్య, రాఘవయ్య పాల్గొన్నారు.



## గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** సైదాపూర్ మండల మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల హుజురాబాద్ మండల కేంద్రంలో అద్దె భవనంలో నడుస్తున్న దాన్ని వెంటనే మంత్రి స్పందించి గురుకుల పాఠశాలను సైదాపూర్‌లోనే నూతన భవనం నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్ కోరారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని నూతన భవనాలు నిర్మించాలని ఎన్ని మార్లు కోరినా పట్టించుకోలేదని, గత కొన్ని సంవత్సరాలుగా సైదాపూర్ గురుకుల పాఠశాల హుజురాబాద్ మండలంలో రైస్ మిల్లుల దగ్గర అద్దె భవనాల్లో నడుపుతున్నారని, మిల్లుల ద్వారా వచ్చే పొగతో విధ్యార్థులకు చర్మ సమస్యలు శ్వాసకోశ సమస్యలు వస్తాయని, ఇలా జరగడం వల్ల విధ్యార్థులు చదువుకు దూరమయ్యే అవకాశముందని వెంటనే మంత్రి స్పందించి సైదాపూర్‌లోనే గురుకుల పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని వెంకటేష్ కోరారు

## పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి : అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని వివిధ హోదాల్లో ఉన్న ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటును నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసే ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ బి.ఎస్.లత అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విధుల్లో ఉన్న ఉద్యోగులు ముందుగా ఫామ్ 12 డిని పొందాలని తదపరి పోస్టల్ బ్యాలెట్‌ను ఓటు వినియోగం కోసం స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయడం జరిగిందన్నారు.తదుపరి పోలీస్,విద్యుత్,హెల్త్, ఆర్‌టిసి, పౌరసరఫరాలశాఖ, అగ్ని మాపక, సమాచారశాఖ,రవాణాశాఖల వారీగా పోస్టల్ బ్యాలెట్ నిర్వహణపై ఆమె సమీక్ష నిర్వహించారు. సమావేశంలో నోడల్ అధికారులు ఎఫ్‌డిఓ రూపేందర్‌సింగ్, ఆర్‌టిఓ సురేష్‌రెడ్డి, డిఎఫ్‌వో(ఫైర్) షణ్ముఖరావు, ఆర్‌టిసి డిఎం సురేందర్, విద్యుత్ డీఈ డి.నాయుడు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాసరాజు,సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న

# బిజెపి ప్రభుత్వాన్ని ఓడిద్దాం

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి

నూతన జాతీయ విద్యావిధానాన్ని ప్రజలు తిరస్కరించాలి



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** రాబోయే ఎంపి ఎన్నికల్లో విద్యావ్యతిరేక విధానాలను అవలంభించిన బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలని ఎఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఎఐఎస్ఎఫ్ సిద్దిపేట జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్న బిజెపి కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపి) 2020 లోపాల పుట్ట అని, విద్యాకషాయికరణ, విద్యా ప్రైవేటీకరణ, విద్య వికేంద్రికరణ కోసమే నూతన విద్య విధానమని, ప్రజలందరూ దీనిని తిరస్కరించాలన్నారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేస్తూ పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను దూరం చేసి కుట్ర అమలు చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా కేంద్రంలో నూతనజాతీయ విద్యావిధానం, 2020 తీసుకొచ్చారని విమర్శించారు. విద్య కార్పోరేటీకరణ, కాషాయికరణ కేంద్రీకరణ చేయాలని కేంద్రం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. దేశంలో జాతీయ విద్యావిధానం వల్ల దాదాపు 90 శాతం విద్యార్థులు నాణ్యమైన విద్య పొందే హక్కును కోల్పోతారని, విద్యా వ్యాపారికరణ వల్ల ఎస్సీ, ఎస్టీ ఓబిసి మైనార్టీ సామాజిక న్యాయం దూరం చేస్తూ రాష్ట్రాల హక్కులను కాలరాసారని మణికంట ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం దేశంలో సుసంపన్నమైన వైవిద్యం, భరితమైన భిన్నత్వంలో ఏకత్వానికి బదులు విద్యాకాషాయికరణ హిందుత్వ అధారిత రాజ్యాన్ని సమాజాన్ని స్థాపించటానికి బాటలు వేస్తుందన్నారు. ఈ విద్యావిధానంలో ప్రైవేటు విశ్వవిద్యాలయం ,విదేశి విశ్వ విద్యాలయానికి అనుమతిస్తారన్నారు. ఇలాంటి లోపాల పుట్ట ఉన్న నూతన జాతీయ విద్యావిధానంను ప్రజలందరు తిరస్కరించాలన్నారు. కేరళ, తమిళనాడు, కర్నాటక, మూడు రాష్ట్రాలు నూతన జాతీయ విధానం తిరస్కరిస్తున్నట్లు అసెంబ్లీలో తీర్మానం చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రజా, విద్యార్థి యువజన, మహిళ , రైతు, వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బిజెపిని రాబోయే ఎన్నికల్లో ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈసమావేశం అనంతరం ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్నకుమార్, గర్ల్స్ కన్వీనర్ ఆకుల శీరిష ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు సంగేం మధు, జెర్రిపోతుల జనార్ధన్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేష్‌లు పాల్గొన్నారు.

## భూకబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడండి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్ కుమార్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** సీతారాంపూర్ లోని సర్వే నెంబర్ 16లో గల 2 ఎకరాల గుంటల ప్రభుత్వ భూమిని భూకబ్జాదారుల నుంచి కాపాడి ఫెన్సింగ్ వేసిన కబ్జాదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్ కుమార్ జిల్లా అధికారులను కోరారు. శనివారం సిపిఐ ఆద్వర్యంలో కొత్తపెల్లి మండలం సీతారాంపూర్‌లోని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ కరీంనగర్ జిల్లా అధనపు కలెక్టర్ కె.లక్ష్మి కిరణ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సంధర్భంగా సృజన్ మాట్లాడుతూ భూ కబ్జాదారులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై గ్రామ పంచాయతీ, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారుల సహకారంతో ఇంటి నెంబర్లతో సర్వే నెంబర్ 16లోని 2 ఎకరాల 30 గుంటల ప్రభుత్వ భూమిని అక్రమ రిజిస్ట్రేషన్లు చేసి అక్రమంగా అమ్మిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అక్రమంగా కబ్జా చేసిన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని భూమి చుట్టూ ఫెన్సింగ్ వేయాలని డిమాండ్ చేశారు. సీతారాంపూర్‌లో యధేచ్చగా ప్రభుత్వ భూమి ఆక్రమణ జరుగుతున్న రెవెన్యూ అధికారులు ఎందుకు మౌన పాత్ర పోషిస్తున్నారో చెప్పాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అవతారం ఎత్తి సీతారాంపూర్ గ్రామ పంచాయతీగా ఉన్నప్పటి నుంచి నగర పాలక సంస్థలో విలీనం జరిగే వరకు ఈ ప్రాంతంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు పెరిగాయన్నారు. సర్వే నెంబర్ 16లో 2 ఎకరాల 30 గుంటల ప్రభుత్వ భూమిని గత పంచాయతీ అధికారులు, రెవెన్యూ రిజిస్ట్రేషన్ అధికారుల భాగస్వామ్యంతో ఆక్రమ కబ్జా జరిగిందని, దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపించి భూ కబ్జాదారులను చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, బ్రాహ్మండ్లపల్లి యుగేందర్ ఉన్నారు.

## ప్రపంచ దేశాలకు

# అన్నంపెట్టే దేశంగా భారత్

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రపంచ దేశాలకు అన్నం పెట్టే దేశంగా భారతదేశం వ్యవసాయంలో అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం శామీర్‌పేట మండలం తుర్కపల్లి పరిధిలోని ఎటిజిసి బయోటెక్ అగ్రి ఇన్నోవేషన్ బ్లాక్‌సి తుమ్మల నాగేశ్వర్‌రావు ముఖ్య అతిదిగా విచ్చేసి శంకుస్థాపన చేశారు. అంతకు ముందు మంత్రిని ప్రొఫెసర్ అర్జుల రాంచంద్రారెడ్డి, ఎజిటిసి అధికారులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ దేశమైన మన దేశంలో వ్యవసాయాన్ని కాపాడుకుని ప్రపంచ దేశాల్లో తినడానికి తిండి లేని రోజుల్లో అత్యధిక జనాభా కల్గిన మన దేశంలో వ్యవసాయం చాల అభివృద్ధి చెందిందన్నారు. దేశాన్ని గడగడలాడించిన కరోనా సమయంలో అన్ని పనులు నిలిచిపోయాయని రైతులు మాత్రం తమ పనిని ఆపలేదన్నారు. మన జాతి ఔన్నత్యానికి నిదర్శనం వ్యవసాయం అన్నారు. వ్యవసాయానికి సరికొత్త పరిజ్ఞానాన్ని ఎటిజిసి సంస్థ అందిస్తూ ఎలాంటి క్రిమిసంహారక పురుగుమందులు లేని పంటలకు హాని చేయని ఉత్పాదనలాను తయారు చేస్తున్నామని ప్రొఫెసర్ రాంచంద్రారెడ్డి చెప్పడం సంతోషం అన్నారు. మట్టితోనే మనకు వ్యవసాయం నేర్పిన ఘనుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకట్‌రెడ్డి అని కొనియాడారు. 40 సంవత్సరాలుగా తాను కూడ వ్యవసాయం చేస్తున్నానని నేను చేసే వ్యవసాయంలో ఏలాంటి యూరియా వాడనని చెప్పారు. ప్రొఫెసర్ రాంచంద్రారెడ్డి, ఏటిజిసి బయోటెక్ సిఇఒ విబి రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయం ద్వార వచ్చే వాతావరణ మార్పులు, పర్యావరణ విధ్వంసం లాంటి సమస్యలను ఆపడానికి నూతన ఆవిష్కరణలు ఈ ఫౌండేషన్ చేయబోతుందని తెలిపారు. పురుగు మందులు వాడకుండానే పురుగుల సంహారాన్ని చేసి రైతులకు మేలు చేయవచ్చన్నారు. దీని ద్వారా రైతులు మంచి దిగుబడులు సాధిస్తారన్నారు. భారతదేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని వ్యవసాయంలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు శ్రమిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు తేజావత్ రామచంద్ర ఐఎఎస్, ప్రొఫెసర్ అప్పారావు, ప్రొఫెసర్ నీలిమా, సహారా ఇంటర్నేషనల్ గ్రూప్ పిటివై లిమిటెడ్ మెరెడ్డి రాహూల్‌రెడ్డి, డాక్టర్ కెఆర్‌కె రెడ్డి, చైర్మన్ ఆండ్ మెనెజింగ్ డైరెక్టర్, శ్రీబయోఎస్తేటిక్స్ జివి రెడ్డి, రాజేష్, వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ నాట్కో, ఎటిజిసి సంస్థ అధికారులు డాక్టర్ మార్కాండేయ, మేనెజింగ్ డైరక్టర్ డాక్టర్ విబి రెడ్డి పాల్గొన్నారు.



## అంగన్‌వాడీల పనిభారం పెరిగింది

ఆయాల ఖాళీలను భర్తీ చేయాలి : విలాస్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్,హెల్పర్స్ అసోసియేషన్ ఎఐటియుసి అనుబంధ యూనియన్ సమావేశం శనివారం సంగంపేట(వెల్మల్ బొప్పారం)లో కామ్రేడ్ శశికళ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ 21 రోజులసమ్మె అంగన్‌వాడీల ఐక్యతను చాటిందన్నారు. అంగన్‌వాడీలపై పనిభారం పెరిగిందని, అంగన్‌వాడీ ఆయాల ఖాళీలను భర్తీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. గత సంవత్సరం సమ్మె సందర్భంగా కుదిరిన ఒప్పందం ఇంకా అమలు కావడం లేదని, వేసవి సెలవులు 30 రోజుల జిఒ విడుదల చేయాలని అన్నారు. ఒంటిపూట బడి అని జిఒ ఉంటే ఇక్కడి అధికారులు భయపెట్టి 4.30 సాయంత్రం వరకు పని చేయాలన్నారు. అంగన్వాడీలు తక్కువ జీతంతో తమ కుటుంబాన్ని గడుపుతున్నారని వారిని ప్రకటనల పేరుతో వేధించవద్దని అన్నారు. అంగన్‌వాడీలకు ఇచ్చి ఫోన్లు పని చేయడం లేదని వాటి స్థానంలో ల్యాబ్‌ట్యాబ్ అందజేయాలని వీటిని తక్షణమే ఇవ్వాలని డిపార్ట్‌మెంట్‌కు సూచించారు. లేని పక్షంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో పోరాటాలు చేయాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో పి.పద్మ ,కుమారి,రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, కే.రాణి, కామ్రేడ్ దుర్గే అనంతరావ్,జిల్లా డి.హెచ్‌పిఎస్ ప్రధాన కార్యదర్శి, దయాసాగరి,సునీత,చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కుటుంబాలకు పూట గడవని దుస్థితి

పవర్లూమ్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి



**ప్రజాపక్షం/సిరిసిల్ల :** సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ గత పాలకుల ప్రస్తుత ప్రభుత్వ నిర్వాహకం ఫలితంగా గత 45 రోజులుగా సిరిసిల్లలోని వస్త్ర పరిశ్రమ పూర్తిగా స్తంభించిపోయిందని చేనేత, పవర్లూమ్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి అన్నారు. శనివారం సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభం ఫలితంగా వైపని కార్మికులు, వార్పిన్ కార్మికులు, గుమస్తాలు వస్త్ర పరిశ్రమపై ఆధారపడిన అన్ని రంగాల కార్మికులు ఉపాధి లేక కుటుంబాలకు కనీసం రెండు పూటలా తిండి పెట్టలేని పరిస్థితులు నెలకొన్నాయని ఒక వైపు గతంలో నడిపిన బతుకమ్మ చీరల ఆర్డర్లకు సంబంధించిన పెండింగ్ బకాయిలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్య బతుకమ్మ చీరల ఆర్డర్లు రాక గతంలో ఎన్నడు లేనివిధంగా వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి నెట్టి వేయబడిందని దీనికి కారకులైన గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఒకరిని ఒకరిగా ఆరోపణలు చేసుకుంటున్నారని విమర్శించారు. సమస్య పరిష్కారం కొరకు నిజాయితీగా ఎవరు కూడా ప్రయత్నాలు చేస్తలేరని నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వం సంబంధిత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టెస్కో డైరెక్టర్ అలుగు వర్షిని సమస్యను దాటవేసే ప్రయత్నం చేస్తారన్నారు. క్షేత్రస్థాయిలో కార్మికుల కుటుంబపరిస్థితి అర్థం చేసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారం చేయకపోతే అన్ని రాజకీయ పక్షాలను కార్మిక సంఘాలను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, సంఘం అధ్యక్షులు అజ్జ వేణు, సీనియర్ నాయకులు నల్ల చంద్రమౌళి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బోధన ఫీజులు తక్షణమే విడుదల చేయండి

ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థుల బోధన ఫీజులు, ఉపకార వేతనాల బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు రూ. 5,600 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బకాయిలు విడుదల చేయకపోవడంతో డిగ్రీ, పిజి పూర్తి చేసిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాలుగేళ్లుగా బోధన ఫీజులు, ఉపకార వేతనాల బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థుల పట్ల ధ్వంద వైఖరిని అవలంభిస్తుందన్నారు. ఎక్కడ టోకెన్లు అక్కడే ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఆర్థిక సంవత్సరంలో జారీ చేసిన రూ. 1500 కోట్లకు పైగా బిల్లులకు సంబంధించి టోకెన్లు అక్కడే ఉన్నాయన్నారు. టోకెన్లకు సంబంధించిన బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. గత ప్ర భుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంభించిందని ఈ ప్రభుత్వం కూ డా అదే ధోరణిని ప్రదర్శిస్తుందన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు వంశీ, పవన్, యశ్వంత్, వికాస్, నరేష్, సాయి పాల్గొన్నారు.

## 8 వేల పేజీల ఇడి చార్జిషీట్

(మొదటి పేజీ తరువాయి)

అనిల్ కుమార్ అగర్వాల్, ఎన్‌బిసిసి మాజీ జనరల్ మేనేజర్ డికె.మిత్తల్, ఎన్‌కెజి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు చెందిన సహాయకులు తేజిందర్ సింగ్‌ను నిందితులుగా ప్రస్తుతానికి గుర్తించారు. అదేవిధంగా రాబోయే కాలంలో ఇంకా ఈ కేసులో అనుబంధ ఫిర్యాదులు కూడా నమోదు చేసి మరిన్ని చార్జిషీటులు పెట్టే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీకి ఎన్నికల నిధుల కింద జలమండలి ద్వారా అవినీతి జరిపి కాంట్రాక్టర్ల నుండి సమకూర్చినట్లు ఇడి ఆరోపిస్తున్నది. ఈ కేసులో ప్రశ్నించేందుకు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను కూడా ఇడి అధికారులు పిలిచారు. ఐతే ఆయన వెళ్ళి సాక్ష్యం ఇవ్వలేదు. మార్చి 21న కేజ్రీవాల్‌ను ఇడి అధికారులు అరెస్టు చేశారు. హవాలా చట్టం కింద మరో కేసు కూడా ఢిల్లీలో ఎక్సైజు విధానానికి అనుబంధంగా నమోదు చేశారు. కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్ ఇంటిపై అధికారులు దాడులు చేశారు. క్షుణ్ణంగా సోదాలు జరిపారు. చార్టర్డ్ అకౌంటెంట్ పంకజ్ మంగళ్ ఇంట్లో కూడా సోదాలు జరిపారు. ఈ కేసులో సిబిఐ ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. జనవరి 31వ తేదీన ఇడి అధికారులు ఈ కేసులో ఆరోరాను, అగర్వాల్‌ను అరెస్టు చేశారు. నకిలీ డాక్యుమెంట్ల ద్వారా ఎన్‌కెజి సంస్థ కాంట్రాకును దాఖలు చేసింది. ఐతే ఈ కంపెనీకి సాంకేతికపరమైన అర్హతలు లేవని అధికారులు చెప్పారు. ఆరోరా ఎన్‌కెజి బ్యాంక్ అకౌంట్ల నుండి లంచాలు తీసుకున్నట్లు అధికారులు చెప్పారు. ఈ ధనాన్ని ఆప్ అధికారులు సమర్పించారని రు చెబుతున్నారు. ఆమ్ ఆద్మీపార్టీ ముడుపుల వ్యవహారంలో ఆ పార్టీపై ఇది రెండో కేసు.

## పటిష్ట భద్రత మధ్య గ్యాంగ్‌స్టర్ ముఖ్తార్ అన్సారీ అంత్యక్రియలు

**లక్నో :** గుండెపోటుతో మరణించిన గ్యాంగ్‌స్టర్, రాజకీయవేత్త ముఖ్తార్ అన్సారీ అంత్యక్రియలు శనివారం ఉత్తర్ ప్రదేశ్‌లోని గాజీపుర్‌లో జరిగాయి. కట్టుదిట్టమైన భద్రత మధ్య కాలీబాగ్‌లోని శ్మశాన వాటికలో అంతక్రియలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా పోలీసులు ప్రత్యేకమైన భద్రత ఏర్పాట్లు చేశారు. పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించారు. అయితే ఈ అంతక్రియలకు అన్సారీ భార్య అఫ్షాన్ అన్సారీ, కుమారుడు అబ్బాస్ హాజరుకాలేదు. భారీ ఎత్తున తరలివచ్చిన ప్రజలు, స్మశానవాటికలోకి ప్రవేశించేందుకు బారికేడ్లను బద్దలు కొట్టడం వల్ల గందరగోళం నెలకొంది. కాగా, యుపిలోని బాందా జైలులో శిక్ష అనుభవిస్తున్న 63 ఏళ్ల అన్సారీ గురువారం రాత్రి 8.25 గంటల సమయంలో ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వాంతులు చేసుకొని అపస్మారక స్థితిలోకి వెళ్లారు. దీంతో జైలు అధికారులు ఆయనను దుర్గావతి మెడికల్ కళాశాల ఆసుపత్రికి తరలించారు. వెంటనే చికిత్స ప్రారంభించినప్పటికీ గుండెపోటుతో ఆయన చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం పోస్ట్‌మార్టమ్ పరీక్షలు నిర్వహించి కుటుంబసభ్యులకు అందించారు. మరవైపు రాష్ట్రంలో ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాటు చేసి 144 సెక్షన్‌ను విధించారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com